Follow: @ANNTELUGU
27-04-2026
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 120 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



మీ టైం అయిపోయింది
## ఇపుడు మా టైం
కవిత సంచలన పోస్ట్
02



డీజిల్ కొరతపై చంద్రబాబు
## సమీక్ష
- యుద్ధ ప్రాతిపదికన సరఫరాకు ఆదేశం

02



సజ్జల భార్గవ్
## విచారణ
- విద్వేష పోస్టుల వెనుక అసలు సూత్రధారి ఎవరు?
- రెండో రోజు విచారణలో ప్రశ్నల వర్షం

02



# ట్రంప్ పై హత్యాయత్నం
## వైట్‌హౌస్‌లో కాల్పుల కలకలం
తప్పిన ముప్పు.. సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది
ఖండించిన మోదీ

**మహా:** అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో జరిగిన ప్రతిష్ఠాత్మక వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కార్యక్రమం కాల్పుల ఘటనతో ఒక్కసారిగా అగ్రరాజ్యమంతా ఉలిక్కిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఆ కార్యక్రమంలో ఓ దుండగుడు ఆయుధాలతో భద్రతా చెక్‌పాయింట్ పైకి దూసుకొచ్చి కాల్పులకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. భద్రతా సిబ్బంది సమయోచితంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పినా, ఘటన తర్వాత ట్రంప్ కూడా తనే లక్ష్యంగా కాల్పులు జరిపినట్లు చేసిన వ్యాఖ్యలు చేయడం మరింత సంచలనంగా మారింది. ఇదేం మొదటిసారి కాదని కూడా అనడంతో గత ఘటనలు కూడా చర్చనీయాంశమయ్యాయి. మొత్తంగా వైట్ హౌస్‌లో కాల్పుల కలకలం సృష్టించాయి. ఈ ఘటనతో అమెరికాలో హైప్రొఫైల్ ఈవెంట్ల భద్రతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వ్యక్తి బహుళ ఆయుధాలతో చెక్‌పాయింట్ వరకు చేరుకోవడం ఎలా సాధ్యమైందన్న దానిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మిగతా 2లో

# బస్సు యాత్రకు కేసీఆర్ రెడీ
## 119 నియోజకవర్గాలు దశలవారీగా చుట్టేలా ప్లాన్
- వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర
- చంద్రబాబు తరహాలో.. కేసీఆర్, యువగళం తరహాలో కేటీఆర్ ప్లాన్
- త్వరలో హరీష్ సారధ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన యాత్ర
- సర్కారుపై పోరుకు బీఆర్ఎస్ వ్యూహం
- రజతోత్సవ సమయాన సరికొత్త సవాళ్ళు..



**హైదరాబాద్ మహా:** రాజకీయ వ్యూహరచనలో కేసీఆర్ శైలే వేరు. తెలంగాణ ఉద్యమంలో అయినా, తర్వాత అయినా పార్టీ డౌన్ అయిన ప్రతిసారీ తన వ్యూహాలతో పార్టీని అంతకుమించి బలోపేతం చేసిన చరిత్ర కేసీఆర్ కు ఉంది. గులాబీ బాస్ కేసీఆర్ ఎక్కడ ఉన్నా.. ఆయన వ్యూహాలపై ఇప్పటికీ అంచనాలు తగ్గలేదు. బీఆర్ఎస్ 25 ఏళ్ళు పూర్తిచేసుకున్న సమయాన..సొంత ఇంటినుండే మరో పార్టీ పుట్టినా కేసీఆర్ ప్రభ ముందు వాటి ప్రభావం ఉండదని బీఆర్ఎస్ ముఖ్యులు అంటున్నారు. ఈ క్రమంలోనే కేసీఆర్ నేతలందరినీ నియోజకవర్గాలు దాటి రావొద్దని హెచ్చరిస్తున్నారు. కీలక నేతలతో భారీ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఇటీవల జగిత్యాలలో భారీ సభకు హాజరైన కేసీఆర్ ప్రసంగంలో తన మునుపటి వాడి చూపే ప్రయత్నం చేశారు. ప్రభుత్వానికి ఇంకా రెండున్నరేళ్ళకు పైగా సమయం ఉండడం, రేవంత్ పార్టీపై ప్రభుత్వంపై పూర్తి పట్టు బిగించడంతో రేవంత్ పేరెత్తకుండా కేసీఆర్ ప్రసంగాలు, విమర్శలు చేస్తున్నారు.



మిగతా 2లో

## బీఆర్ఎస్@25
- సెలబ్రేషన్స్ పై కేటీఆర్ పిలుపు
- నేడు తెలంగాణభవన్ కు కేసీఆర్

**హైదరాబాద్, మహా:** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం మరియు జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను సగర్వంగా ఎగురవేసి, గులాబీ జెండా పండుగను జరుపుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన ఈ పార్టీ పాతికేళ్ల వసంతంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొని పార్టీ పటిష్టతను చాటాలని సూచించారు. తెలంగాణ భవన్లో రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ఆదేశాల మేరకు ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు సహా.. మాజీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని స్పష్టం చేశారు.ప్లీనరీ సమావేశానికి తెలంగాణ భవన్లో పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. కేవలం ఆహ్వానం ఉన్నవారు మాత్రమే హాజరుకావాలని, మిగిలిన వారంతా తమ నియోజకవర్గాల్లోనే వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కేటీఆర్ కోరారు. సుదూర ప్రాంతాల నుంచి ప్లీనరీ సమావేశానికి వచ్చేవారు.. మధ్యాహ్నం 1.30 గంటలకల్లా హైదరాబాద్ కు చేరుకోవాలని సూచించారు.




# మేలో మంత్రివర్గ విస్తరణ ఆశలు
## కార్పొరేషన్ పదవులపై కసరత్తు
- త్వరలో ముగియనున్న 37 మంది చైర్మన్ల పదవీకాలం
- చైర్మన్ల పనితీరు.. రెన్యువల్స్ పై రిపోర్ట్
- రెండున్నరేళ్లయినా ఇంకా అనేకపదవులు ఖాళీ
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- ఇటీవల ఎమ్మెల్యేలకు డీసీసీలు, సెల్ బాధ్యతలు
- త్వరలో మరికొందరు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలకు చైర్మన్ పదవులు



(హైదరాబాద్ - మహా)

ఎపుడెపుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ మేలో జరగవచ్చన్న చర్చ తాజాగా జరుగుతోంది. ఎమ్మెల్సీగా అజారుద్దీన్ కు లైన్ క్లియర్ కావడంతో కాంగ్రెస్ సర్కారు ఊపిరి పీల్చుకోగా, మేలో విస్తరణ జరగవచ్చని తాజాగా వినపడుతోంది. ఏప్రిల్ లోనే విస్తరణ ఉంటుందని హడావుడి జరిగినా, ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ముందుకు పడలేదు. ఇపుడు మే 4న ఫలితాలు రానుండగా, మే 2వ వారం తర్వాత విస్తరణ ఉండే అవకాశమందని ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం చాలాకాలంగా ఆశావహులు పోటీపడుతున్నారు. సామాజికవర్గాలు, జిల్లాల సమీకరణాలతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బాలూనాయక్, ప్రేమ్‌సాగర్‌రావు, ఆది శ్రీనివాస్, నవీన్ యాదవ్, బీర్ల ఐలయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రాంమోహన్‌రెడ్డి, విజయశాంతి.. ఇలాంటివారి పేర్లు వినిపించాయి. ఇటీవల కేరళలో మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు. త్వరలో విస్తరణ జరుగుతుందని స్పష్టంగా చెప్పారు. రెండున్నరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈసారి మే నెలలో చివరి మార్పుగా

మిగతా 2లో

# డిజిటల్ జనగణనకు సీఎం శ్రీకారం
- పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన రేవంత్ రెడ్డి
- స్వీయగణన చేసిన గవర్నర్ శుక్లా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త అధ్యాయానికి తెరలేస్తూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న డిజిటల్ జనగణనలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. ఆదివారం తన నివాసంలో జనగణన అధికారుల సమక్షంలో 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (స్వయంగా వివరాల నమోదు) ప్రక్రియను ఆయన పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ డిజిటల్ సర్వేలో భాగంగా, ముఖ్యమంత్రి స్వయంగా వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి తన కుటుంబ వివరాలను నమోదు చేయడం ద్వారా ప్రజలకు ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పారదర్శకంగా జరగనున్న ఈ జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్రంలో స్వీయగణన ప్రారంభించగా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్రమంత్రులు కూడా స్వీయగణన ద్వారా వివరాలు నమోదుచేశారు.

### పదిహేను రోజుల గడువు

రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 26నుంచి మే 10వ తేదీ వరకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' ప్రక్రియ అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

మిగతా 2లో

# పెళ్ళి చేపుకుంటానని రూ. 9.35 కోట్ల దోపిడీ
## నటి అషు రెడ్డిపై సీసీఎస్‌లో కేసు నమోదు
'నమ్మించి మోసం చేసిందని బాధితుడి తండ్రి ఫిర్యాదు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహానగరంలో ప్రేమ, పెళ్లి పేరుతో కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడిన ఉదంతం ఒకటి వెలుగులోకి వచ్చింది. వెండితెరపై మెరిసే నటి తన నటనా కౌశలాన్ని నిజజీవితంలో కూడా ప్రదర్శించి, ఒక ఎన్ఆర్ఐ యువకుడిని నిలువునా ముంచేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, వివిధ కారణాలు చెప్తూ ఏకంగా రూ.9కోట్లకు పైగా కాజేసినట్లు ఆరోపణలు రావడంతో నగరవాసులు విస్మయానికి గురవుతున్నారు. ఈ భారీ ఆర్థిక మోసానికి సంబంధించి బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులను

మిగతా 2లో



# జీన్స్‌లో జగన్
- స్టైలిష్ లుక్‌లో లండన్ ప్రయాణం
- సతీమణి భారతితో కలిసి విదేశీ పర్యటన



**హైదరాబాద్, మహా:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన విలక్షణ రాజకీయ వేషధారణకు స్వస్తి పలికి, అరుదైన రీతిలో సరికొత్త ఆహార్యంతో దర్శనమిచ్చారు. సాధారణంగా తెల్లటి షర్టు, ఖాకీ ప్యాంటుతో నిరాడంబరంగా కనిపించే ఆయన, లండన్ పర్యటన సందర్భంగా పూర్తి స్టైలిష్ లుక్‌లోకి మారిపోయారు. బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, అదే రంగు షర్టు ధరించి నవ యువకుడిలా మెరిసిపోతున్న జగన్ ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఆయన కనిపిస్తున్న ఈ 'కూల్' లుక్ చూసి అభిమానులు, సామాన్య ప్రజలు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. విదేశీ పర్యటనలో ఆయన అనుసరించిన ఈ శైలి ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. జగన్ దంపతులు లండన్‌లో సుమారు రెండు వారాల పాటు గడపనున్నారు. మే 10వ తేదీ రాత్రి లేదా మే 11వ తేదీ ఉదయం వారు తిరిగి భారతదేశానికి చేరుకునేలా ప్రయాణ ప్రణాళికను రూపొందించుకున్నారు.

## పెళ్ళి చేపుకుంటానని
# రూ. 9.35 కోట్ల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించడంతో ఈ కిలేడీ భాగోతం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వై.వి. ధర్మేంద్ర అనే యువకుడు లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. 2018వ సంవత్సరంలో ఆయన తన స్వదేశానికి వచ్చిన క్రమంలో సినీ నటి అనూష రెడ్డితో పరిచయం ఏర్పడింది. మొదట్లో స్నేహపూర్వకంగా సాగిన వీరి పరిచయం, అనతికాలంలోనే ప్రేమగా మారింది. ధర్మేంద్ర తన ఉద్యోగ రీత్యా లండన్‌లో ఉన్నప్పటికీ, అనూష రెడ్డి ఆయనతో నిరంతరం టచ్‌లో ఉంటూ అనుబంధాన్ని పెంచుకుంది. ఈ క్రమంలోనే తామిద్దరం వివాహం చేసుకుందామని ఆమె ధర్మేంద్రకు నమ్మకమైన హామీ ఇచ్చింది. ధర్మేంద్ర మనసు గెలుచుకున్న అషు రెడ్డి, ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టింది. తాను విలాసవంతమైన జీవితం గడపడానికి, కొత్త ప్రాజెక్టుల కోసమని, వ్యక్తిగత అవసరాల కని రకరకాల సాకులు చెప్పడం మొదలుపెట్టింది. పెళ్లి చేసుకోబోయే భార్యే కదా అనే నమ్మకంతో ధర్మేంద్ర కూడా వెనకాడకుండా ఆమె అడిగినప్పుడల్లా భారీ మొత్తంలో డబ్బులను ఆమె ఖాతాకు బదిలీ చేస్తూ వచ్చారు. ఇలా 2018 నుంచి నేటి వరకు దశలవారీగా మొత్తం రూ. 9.35 కోట్లను ఆమె కాజేసినట్లు తెలుస్తోంది.

### సీసీఎస్ పోలీసుల రంగప్రవేశం

జరిగిన అన్యాయంపై బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని పెళ్లి పేరుతో నమ్మించి, ప్రేమ వలలో పడేసి రూ. 9.35 కోట్లు కాజేసిన నటి అషు రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆమెపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ భారీ ఆర్థిక నేరం కావడంతో సీసీఎస్ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

# బస్సు యాత్రకు కేసీఆర్ రెడీ

(మొదటిపేజీ తరువాయి)

2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చీఫ్ గా రేవంత్ తనదైన వ్యూహాలతో కేసీఆర్ ను బోల్తా కొట్టించారు. బీఆర్ఎస్ పోవడానికి, కాంగ్రెస్ రావడానికి రేవంత్ కారణమన్న చర్చ అంతటా ఉంది. కేసీఆర్ ఇప్పటికీ తన ప్రసంగాల్లో పేరు తీసుకోడు. అయితే ప్రభుత్వ వైఫల్యాలే.. బీఆర్ఎస్ విజయానికి బాటలు వేస్తాయని గులాబీ నేతలు ధీమాలో ఉన్నారు.

### త్వరలో బస్సు యాత్ర

గులాబీ దళపతి కేసీఆర్ త్వరలో బస్సుయాత్ర ప్రారంభించాలని భావిస్తున్నారు. త్వరలోనే 119 నియోజకవర్గాల్లో కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహించబోతున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మా పార్టీ అధినేత కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర చేపడతారని స్పష్టం చేశారు. ఇప్పటికే తాను పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించగా ఇప్పుడు కేసీఆర్ బస్సు యాత్రకు ప్రణాళికలు వేస్తుండటం ఆసక్తికరంగా మారింది. వందకు పైగా నియోజకవర్గాల్లో బస్సుయాత్ర సాగనుంది. ఏకబిగిన ఒకేసారి కారుండా రెండు లేదా మూడు విడతల్లో ఈ బస్సుయాత్ర ఉండే అవకాశముంది. కేటీఆర్ పాదయాత్రకు ముందే ఈ ఏడాదే బస్సు యాత్ర ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. జూన్ తర్వాత కేసీఆర్ దీనిపై స్పష్టతనివ్వనుండగా, ఆగస్టు లేదా సెప్టెంబర్ నాటికి దీనికి ముహూర్తం కుదిరే అవకాశముంది. కేసీఆర్ కు బస్సు ప్రయాణం ఇష్టం. గతంలో సీఎంగా ఉన్నపుడు భారీ సభలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ప్రత్యేకంగా తయారుచేయించిన బస్సులో వెళ్ళేవారు. లోక్ సభ ఎన్నికల ప్రచారం కూడా బస్సు ద్వారానే నిర్వహించారు. మరోవైపు బీఆర్ఎస్ కీలకనేత, మాజీ మంత్రి హరీష్ రావు సారథ్యంలో కీలకనేతల టీమ్ ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వ వైఫల్యాన్ని, రైతాంగ సమస్యలపై ప్రభుత్వ తీరుపై పెండింగ్ లో సాగునీటి ప్రాజెక్టులను సందర్శించే యాత్ర చేపట్టాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండున్నరేళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం వైఫల్యాలపై తప్పితే కొత్త ప్రాజెక్టుల నిర్మాణంపై ఫోకస్ పెట్టలేదని బీఆర్ఎస్ హైలెట్ చేయాలని భావిస్తోంది.

### చంద్రబాబు, లోకేష్ తరహాలో..

గతంలో చంద్రబాబు ఏపీలో బస్సుయాత్ర చేపట్టగా, యువనేత లోకేష్ యువగళం పేరుతో రాష్ట్రమంతా పాదయాత్ర చేపట్టారు. ఈ ప్లాన్ వర్కవుట్ అయింది. క్యాడర్ లో జోష్ నింపడంలో ఆ యాత్రలు సక్సెస్ అయ్యాయి. తెలంగాణలో అంత ఘర్షణపూర్వక వాతావరణం లేకున్నా పోరాటం, కార్యాచరణ గట్టిగానే చేయాలని బీఆర్ఎస్ డిసైడైంది. ఇటీవల కేసీఆర్ తాము అధికారంలోకి వస్తే హైడ్రాను ఎత్తి అవతల పారేస్తామని ప్రకటించారు. గతంలో రేవంత్ ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామన్న తరహాలోనే.. ఈ నినాదం బలంగా తీసుకెళ్తున్నారు.

## అజారుద్దీన్, కోదండరాంను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ
# నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, మహా:** అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకమయ్యారు. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంత్రి అజారుద్దీన్ , కోదండరాంల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు ఇటీవల లైన్ క్లియర్ అయింది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోయేవారు. ఇపుడు ఆ సమస్య లేదు.

## మీ టైం అయిపోయింది
# ఇపుడు మా టైం

**కవిత సంచలన పోస్ట్**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన పోస్ట్ పెట్టారు. 'ఇక మీ టైం అయిపోయింది, మా టైం వచ్చింది' అని పేర్కొన్నారు. నిన్న కవిత తన పార్టీ పేరును టీఆర్ఎస్ అని ప్రకటించిన వెంటనే.. బీఆర్ఎస్ పార్టీ నేతలు సెటైర్లతో పోస్టులు పెట్టగా, కవిత పార్టీ ఆవిర్భావ ఫోటోలతో సంచలన కామెంట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సమయంలో కవిత పోస్ట్ సంచలనంగా మారింది.

# డీజిల్ కొరతపై చంద్రబాబు సమీక్ష

## యుద్ధ ప్రాతిపదికన సరఫరాకు ఆదేశం

**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ, ఇంధన కరువుతో అల్లాడుతున్న వాహనదారులు మరియు అన్నదాతల కష్టాలను చూసి చలించిన ఆయన, సచివాలయ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు వెలుస్తుండటం, వాహనదారులు కిలోమీటర్ల మేర క్యూ కట్టడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజిల్ కొరత ఉండకూడదని, యుద్ధ ప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించాలని ఆయన అధికారులకు హుకుం జారీ చేశారు. ప్రజలకు కనీస అవసరమైన ఇంధనం అందకపోవడం అభివృద్ధికి గొడ్డలి పెట్టు వంటిదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఈ సంక్షోభంపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. ఏపీలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, సరఫరా గొలుసు తెగిపోవడం వల్ల ఇప్పటివరకు 421 బంకులు పూర్తిగా మూతపడ్డాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా వినియోగదారులు 'ప్యానిక్ కొనుగోళ్లకు' పాల్పడటం వల్ల కృత్రిమ డిమాండ్ ఏర్పడిందని, దీనివల్ల ఉన్న నిల్వలు కూడా క్షణాల్లో ఖాళీ అవుతున్నాయని సీఎంకు నివేదించారు. అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య సాగుతున్న యుద్ధ వాతావరణం వల్ల చమురు దిగుమతులు , రవాణాలో అంతరాయం కలగడమే ఈ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణమని అధికారులు వివరణ ఇచ్చారు. అయితే, కారణాలు ఏవైనా సరే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని చంద్రబాబు ఆదేశించారు.

# డీజిల్ కల్లోలం

- రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఒక్క లీటర్ కూడా కొరత ఉండొద్దు
- అధికారులకు వార్నింగ్
- యుద్ధ ప్రాతిపదికన సరఫరాకు సర్కార్ ఆదేశం

**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పడగ విప్పిన డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ, ఇంధన కరువుతో అల్లాడుతున్న వాహనదారులు మరియు అన్నదాతల కష్టాలను చూసి చలించిన ఆయన, సచివాలయ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు వెలుస్తుండటం, వాహనదారులు కిలోమీటర్ల మేర క్యూ కట్టడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజిల్ కొరత ఉండకూడదని, యుద్ధ ప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించాలని ఆయన అధికారులకు హుకుం జారీ చేశారు. ప్రజలకు కనీస అవసరమైన ఇంధనం అందకపోవడం అభివృద్ధికి గొడ్డలి పెట్టు వంటిదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

### అధికారుల వివరణ - గణాంకాల విశ్లేషణ

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఈ సంక్షోభంపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. ఏపీలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, సరఫరా గొలుసు తెగిపోవడం వల్ల ఇప్పటివరకు 421 బంకులు పూర్తిగా మూతపడ్డాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా వినియోగదారులు 'ప్యానిక్ కొనుగోళ్లకు' పాల్పడటం వల్ల కృత్రిమ డిమాండ్ ఏర్పడిందని, దీనివల్ల ఉన్న నిల్వలు కూడా క్షణాల్లో ఖాళీ అవుతున్నాయని సీఎంకు నివేదించారు. అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య సాగుతున్న యుద్ధ వాతావరణం వల్ల చమురు దిగుమతులు , రవాణాలో అంతరాయం కలగడమే ఈ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణమని అధికారులు వివరణ ఇచ్చారు. అయితే, కారణాలు ఏవైనా సరే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని చంద్రబాబు ఆదేశించారు.

### అన్నదాతల ఆవేదన - సీఎం భరోసా

ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఈ డీజిల్ కొరత రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తోంది. కోత మిషన్లు, ట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ దొరక్కపోవడంతో చేతికి వచ్చిన పంట నేలపాలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కళ్లాల్లో ఉన్న సమయంలో ఇంధనం కోసం బంకుల వద్ద పడిగాపులు కాయడం దురదృష్టకరమని సీఎం పేర్కొన్నారు. రైతన్నలకు ఒక్క లీటర్ డీజిల్ కూడా లోటు రాకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆజ్ఞాపించారు. ఇంధన కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, అదనపు లోడ్లు రాష్ట్రానికి వచ్చేలా చూడాలని పౌర సరఫరా అధికారులకు దిశానిర్దేశం చేశారు.




### కృత్రిమ కొరతపై ఉక్కుపాదం

రాష్ట్రంలో డీజిల్ సమస్యతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని, తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆజ్ఞాపించారు. ఇంధన మాఫియా లేదా బ్లాక్ మార్కెట్ కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సామాన్య వాహనదారుల నుంచి భారీ వాహనాల వరకు ఎక్కడా రవాణా స్తంభించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ వేగవంతమైన చర్యల వల్ల రాబోయే 24 గంటల్లో పరిస్థితి అదుపులోకి వస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు నేరుగా రంగంలోకి దిగడంతో బంకుల వద్ద మళ్ళీ సందడి నెలకొంటుందని వాహనదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# ట్రంప్ పై హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

అయితే భద్రతా వ్యవస్థ వేగంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు చెబుతున్నారు.

### ట్రంప్ స్పందన

ఈ ఘటనపై స్పందించిన అధ్యక్షుడు ట్రంప్ దుండగుడిని లోన్ వుల్ఫ్‌గా అభివర్ణించారు. "నా అభిప్రాయం ప్రకారం ఇది ఒంటరి వ్యక్తి చర్య. పెద్ద కుట్రకు సంబంధించిన ఆధారాలు లేవు" అని ఆయన తెలిపారు. ఈ దాడికి అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం లేదని కూడా స్పష్టం చేశారు. ఘటన అనంతరం మీడియాతో మాట్లాడిన ట్రంప్, భద్రతా లోపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమం జరిగిన హోటల్‌ను అంతగా సురక్షితమైన ప్రదేశం కాదంటూ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి కీలక కార్యక్రమాలను మరింత భద్రత కలిగిన ప్రదేశాల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

### హింసకు తావు లేదు- ప్రధాని మోదీ

ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ, "వాషింగ్టన్ డీసీలోని ఒక హోటల్‌లో ఇటీవల జరిగిన భద్రతా ఘటన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ క్షేమంగా, ఎటువంటి హాని లేకుండా ఉన్నారని తెలిసి ఊరట చెందాను. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు. దానిని నిస్సందేహంగా ఖండించాలి" అని తెలిపారు.

## డిజిటల్ జనగణనకు
# సీఎం శ్రీకారం



(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ రావడానికి 15 రోజుల ముందే ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ పద్ధతి ద్వారా సమయం ఆదా అవ్వడమే కాకుండా, వివరాలు మరింత ఖచ్చితత్వంతో నమోదవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎవరైతే స్వయంగా వివరాలు నమోదు చేసుకుంటారో, వారికి ఒక ప్రత్యేకమైన 11 అంకెల ఐడీ లభిస్తుందని, ఆ తర్వాత అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఆ నంబర్ చూపిస్తే సరిపోతుందని ఆయన పేర్కొన్నారు.

### ముప్పై మూడు ప్రశ్నలతో సమగ్ర సర్వే

మొదటి విడతగా చేపట్టిన ఈ హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా) ప్రక్రియలో మొత్తం 33 రకాల ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించారు. నివాస గృహం యొక్క పరిస్థితి, ఇంట్లోని సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, ఇతర ఆస్తుల వంటి కీలక సమాచారాన్ని ఈ దశలో సేకరించనున్నారు. ఈ సమాచారమంతా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు మరియు మౌలిక సదుపాయాల కల్పనకు వెన్నెముకగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్వయంగా వివరాలు నమోదు చేస్తున్న సమయంలో అధికారులు పక్కనే ఉండి పోర్టల్‌లోని మ్యాపింగ్ ఫీచర్ మరియు డేటా సెక్యూరిటీ అంశాలను ఆయనకు వివరించారు.

### అవగాహన కల్పించడమే లక్ష్యం

జనగణన అనేది కేవలం అంకెల సేకరణ మాత్రమే కాదని, అది ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే దిక్సూచి అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. సామాన్య ప్రజలకు ఈ డిజిటల్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకే తాను స్వయంగా రంగంలోకి దిగానని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నివసించేవారు, స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో విస్తృతమైన ప్రచారం నిర్వహించి, ప్రతి పౌరుడు ఈ డిజిటల్ పండుగలో పాల్గొనేలా చూడాలని ఆయన ఆదేశించారు.

### భారీగా సిబ్బంది కేటాయింపు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సుమారు 94 వేల మంది సిబ్బందిని రంగంలోకి దించింది. వీరిలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఐటీ నిపుణులు ఉన్నారు. ఇప్పటికే వీరందరికీ స్మార్ట్ ఫోన్ల ద్వారా డేటా సేకరణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గతంలో మాదిరిగా కాగితం పలకలు లేకుండా, నేరుగా మొబైల్ యాప్ ద్వారా డేటా క్లౌడ్‌లోకి చేరుతుందని, దీనివల్ల తప్పులకు తావుండదని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. మే 11వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాల సేకరణను పూర్తి చేస్తారని ఈ సందర్భంగా వెల్లడించారు.



# మేలో మంత్రివర్గ విస్తరణ ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

క్యాబినెట్ పునర్ వ్యవస్థీకరణ ఉంటుందన్నది రాష్ట్ర పార్టీ వర్గాల సమాచారం. అనేకమంది శాఖలు కూడా మారవచ్చని, ఒకరిద్దరికి కత్తిరింపు కూడా ఉండవచ్చని ప్రచారాలు ఉన్నాయి. అయితే శాఖల్లో మార్పుల ద్వారా నూతనోత్సాహం తీసుకురావాలని సీఎం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

### నామినేటెడ్ పదవుల్లో తీవ్ర జాప్యం

నామినేటెడ్ పదవుల నియామకాల్లోనూ కాంగ్రెస్ తీవ్ర జాప్యం చేస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బారీగా ఛైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులు కూడా భర్తీచేసింది. 60కు పైగా ఛైర్మన్లు,. వందల కొద్దీ డైరెక్టర్ పదవులు ఖరారుచేసి క్యాడర్ లో ఉత్సాహం నింపింది. తెలంగాణలో ఆది నుండీ పదవుల భర్తీకి అనేక అడ్డంకులు ఉన్నాయి. 37 ఛైర్మన్ పదవులు భర్తీచేయగా, వాటి గడువు మరో రెండు మాసాల్లో పూర్తి కానుంది. ఛైర్మన్ల పనితీరుపై పలు రిపోర్ట్ లు అందినట్లు తెలుస్తోంది. వీటిపై సమీక్ష కూడా జరిగింది. మొదట్లో ఇద్దరు, ముగ్గురు మినహా రెన్యువల్స్ ఉండవన్న ప్రచారం జరిగింది. అయితే ఛైర్మన్లు అందరికీ రెన్యువల్ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు కూడా జరగలేదు. బ్యాంక్ ఛైర్మన్ పదవులను కూడా నామినేట్ చేయలేదు. నియోజకవర్గం కేంద్రంగా ఎమ్మెల్యేలను, నియోజకవర్గ ఇన్ ఛార్జిలను బలోపేతం చేయాల్సి ఉంది. గతంలో కౌశిక్ రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వడం వల్లే ఈటల రాజేందర్ లాంటి బలమైన నేతను కూడా ఓడించగలిగారు. ఇటీవల పలువురు ఎమ్మెల్యేలకు డీసీసీలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు, నేతలకు ప్రాధాన్యం పెంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మీకు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేస్తా అంటూ సీఎం రేవంత్ ఇటీవల కేసీఆర్ కు సవాల్ విసరగా, పార్టీ యంత్రాంగంలో ఉత్సాహం నింపే కార్యాచరణ తీసుకోవాల్సి ఉంది. ఇటీవల పదవులు, పీసీసీ కార్యవర్గంపై సీఎం రేవంత్ తో ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చర్చించారు. తర్వాత పీసీసీ చీఫ్ ఢిల్లీలో మూడు,నాలుగు రోజులు పర్యటించారు. పీసీసీ చీఫ్ పదవిపై కూడా పలువురు కన్నేశారు. ఈ క్రమంలో పదవుల భర్తీ, కాంగ్రెస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.



## సజ్జల భార్గవ్
# విచారణ

- విద్వేష పోస్టుల వెనుక అసలు సూత్రధారి ఎవరు?
- రెండో రోజు విచారణలో ప్రశ్నల వర్షం

**విజయవాడ, మహా:** వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌ఛార్జ్ సజ్జల భార్గవ్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. సోషల్ మీడియా వేదికగా విద్వేషాల విషం చిమ్మడం, ప్రత్యర్థి పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టించారనే ఆరోపణలపై సాగుతున్న విచారణ ఆదివారం ఉదయానికి ఒక కొలిక్కి వచ్చింది. పులివెందుల పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల పాటు సాగిన ఈ విచారణ ప్రక్రియలో పోలీసులు అనేక కీలక అంశాలను రాబట్టే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు మహిళా నేతలను, రాజకీయ ప్రముఖుల కుటుంబ సభ్యులను కించపరిచేలా సాగిన పోస్టుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో పోలీసులు భార్గవ్ రెడ్డిని నిలదీశారు. ఏప్రిల్ 25న ప్రారంభమైన ఈ విచారణ పర్వం ఆదివారం ముగిసింది. డీఎస్పీ మురళీ నాయక్ నేతృత్వంలోని బృందం సంధించిన అనేక సూటి ప్రశ్నలకు భార్గవ్ రెడ్డి 'తెలియదు', 'గుర్తులేదు' అంటూ సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ మరియు వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ పెట్టిన అభ్యంతరకర పోస్టుల వెనుక ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయనే అంశంపై కూడా పోలీసులు దృష్టి సారించారు. పులివెందులలో భార్గవ్ రెడ్డి విచారణ ముగిసినప్పటికీ, ఆయన ఇచ్చిన సమాచారాన్ని పోలీసులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. పోస్టుల రూపకల్పనలో వాడిన గ్యాడ్జెట్లు, వాట్సాప్ గ్రూపుల సమాచారాన్ని ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# రౌడీ షీటర్లపై డ్రోన్ల నిఘా

- పెట్టుబడులే లక్ష్యంగా పక్కాగా శాంతిభద్రతలు
- పోలీసు బలగాల హేతుబద్ధీకరణకు సీఎం గ్రీన్ సిగ్నల్!
- నేరాల వేటలో కొత్త వ్యూహం
- ఏపీలో పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు బాబు సంచలన ఆదేశాలు!

**విజయవాడ, మహా:** నేరగాళ్ల ఆటకట్టించేందుకు సరికొత్త వ్యూహంతో రాష్ట్ర సచివాలయంలో హోం శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు వ్యవస్థలో సమూల మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బలగాల హేతుబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలని, ఎక్కడా సిబ్బంది కొరత అన్న మాట వినిపించకూడదని అధికారులను గట్టిగా ఆదేశించారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన జిల్లాలు, సున్నితమైన ప్రాంతాలు, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన దేవాలయాల వద్ద అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టమైన నిఘా ఉంటేనే సమాజంలో నేరగాళ్లకు భయం ఉంటుందని, తద్వారా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### తగ్గిన నేరాలు.. పెరిగిన టెక్ మోసాలపై బాబు గురి

రాష్ట్రంలో గతంతో పోలిస్తే నేరాల శాతం ఆరు శాతం మేర తగ్గడం పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, అంతర్జాల మోసాలు (సైబర్ నేరాలు), ఆర్థిక నేరాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వాడుకుంటూ చేస్తున్న మోసాలను అరికట్టేందుకు పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రానికే పెట్టుబడులు క్యూ కడతాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాలన్నా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావాలన్నా పోలీసుల పనితీరు అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఆకర్షించాలంటే రాష్ట్రం సురక్షితం అనే భరోసాను కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపైనే ఉందని గుర్తు చేశారు.

### రౌడీ గ్యాంగులపై ఉక్కుపాదం.. డ్రోన్ల నిఘా సిద్ధం

నేర ప్రవృత్తి ఉన్న వ్యక్తులు, రౌడీ షీటర్ల కదలికలను కనిపెట్టేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి సరికొత్త సూచన చేశారు. నెల్లూరులో పట్టుబడిన రౌడీ గ్యాంగుల తరహాలోనే రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ అసాంఘిక శక్తుల కదలికలు ఉన్నాయేమో ఆరా తీయాలని ఆదేశించారు. రౌడీయిజం, గూండాయిజం అన్న పదాలే రాష్ట్రంలో వినిపించకూడదని, అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. గంజాయి, మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను పూర్తిగా తుడిచిపెట్టాలని, అదే సమయంలో వ్యసనాలకు బానిసైన వారికి పునరావాస కేంద్రాల ద్వారా విముక్తి కల్పించే చర్యలు చేపట్టాలని సూచించారు. కఠినమైన పోలీసు వ్యవస్థే నేరగాళ్లలో వణుకు పుట్టిస్తుందని, సామాన్యుడికి భరోసా ఇస్తుందని బాబు వ్యాఖ్యానించారు.

### రహదారి భద్రత.. మహిళా రక్షణకు పెద్దపీట

రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 503 ప్రమాదకర మలుపులు (బ్లాక్ స్పాట్స్) వద్ద ప్రమాదాలను నివారించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైన చోట తక్షణ వైద్యం కోసం అత్యవసర చికిత్సా కేంద్రాలను (ట్రామా సెంటర్లు) ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టడం శుభపరిణామమని పేర్కొన్నప్పటికీ, పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. అపరాధులు శిక్షల నుంచి తప్పించుకోలేరనే భయం కలిగించేలా విచారణ ప్రక్రియ వేగవంతం కావాలని కోరారు. రహదారి భద్రత నుంచి మహిళా రక్షణ వరకు ప్రతి విషయంలోనూ పోలీసులు తమ నిబద్ధతను చాటుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# భద్రాచలంలో బీసీ భవన్ నిర్మించాలి

**బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాచలం పుణ్యక్షేత్రంలో బీసీ భవన్ నిర్మించాలని ఇందుకు ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టేలా చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు(క్యాబినెట్ హోదా)తిరుమలగిరి సురేందర్ కు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆదివారం పాల్వంచలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి అమ్మ వారి దర్శనానికి వచ్చిన బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ కు బీసీ సంక్షేమ సంఘం భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిత్యాన్న దాన సత్రంలో ఘనంగా సన్మానం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు పది లక్షలపై చిలుకు జనాభాతో కూడిన 56 బీసి కులాల సంక్షేమం కోసం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో కమ్యునిటీ హాళ్లు, దక్షణ అయోధ్యగా పిలువబడే భద్రాచలంలో 100 రూములతో ధర్మసత్ర బీసీ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. తెలంగాణా రాష్ట్ర బీసి సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటి తరుపున వినతి పత్రం అందచేసి సంఘం తరుపున దుశ్శాలువతో పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో బీసి సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పామర్తి అంకినీడు ప్రసాద్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మాదా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ కొడగాని శ్రీనివాస్ యాదవ్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు మహాంకాళి బిక్షపతి, గాజుల శ్రీనివాస్, సమ్మెట అప్పారావు, ఐక్య తల్లిదండ్రుల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, శనగ రాంచందర్ రావు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు



**మంచిర్యాల, మహా :** విశ్వనాథ ఆలయంలో శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తన సతీమణి, స్థానిక దేవాలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి మాత జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని వెల్లడించారు. ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం ఊరేగింపు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ దంపతులకు దేవాదాయ శాఖ అధికారి, ఆలయ అర్చకులు, ఆర్యవైశ్య ప్రముఖులు స్వాగతం పలికారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, ఆర్యవైశ్య ప్రముఖులు సిరిపురం రాజేశం, కటకం హరీష్, చిలువేరు శ్రీనివాస్, ముక్త శ్రీనివాస్, మాదంశెట్టి సత్యనారాయణ, కొత్త రాజేశం, కేశెట్టి వంశీకృష్ణ, వాసవి క్లబ్ మంచిర్యాల ప్రతినిధులు హాజరై శ్రీ వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్

### ఘనంగా స్వాగతం పలికిన ఆలయ ఈవో రజనీ కుమారి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ మెంబర్(క్యాబినెట్ హోదా)ఉమ్మడి రాష్ట్ర ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్ ఆదివారం పాల్వంచ మండలంకేశవాపురంజగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో రజనీ కుమారి వారి సిబ్బందితో కలసి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చన పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అమ్మ వారి ప్రసాదం అందించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సురేందర్ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పామర్తి అంకినీడు ప్రసాద్ గౌడ్, ఉపాధ్యక్షులు మాదా శ్రీరాములు, జిల్లా జనరల్ సెక్రటరి మహేష్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొడగాని శ్రీనివాస్ యాదవ్, గాజుల శ్రీనివాస్, కొత్తగూడెం టౌన్ అధ్యక్షులు మహంకాళి భిక్షపతి, బీసి సంఘం రాష్ట్ర నాయకులు సమ్మెట అప్పారావు, ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ శనగ రామచందరరావు తదితరులు పాల్గొన్నారు.



## రామవరంలో పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రామవరం నెహ్రూ బస్తిలో వెలిసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునగడప వెంకటేశ్వర్లు పూజా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ బ్రహ్మం రచించిన కాలజ్ఞానం సమాజాన్ని ఒక మార్గంలో నడిపించడానికి దిక్సూచిగా పనిచేస్తుందని అన్నారు. కులం మతం లేదని మానవులంతా ఒక్కటే అని వేల సంవత్సరాల క్రితం చెప్పిన గొప్పతాత్వికుడు, దైవాంశ సంభూతులు వీరబ్రహ్మం మేనని పేర్కొన్నారు. వర్గ వైషమ్యాలు లేనటువంటి సమ సమాజ స్థాపన మానవులంతా ఒకటే అని ఆకాంక్షించిన గొప్ప మానవతావాది తాత్వికుడు వీర బ్రహ్మం అని అన్నారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం ఆశీస్సులు ప్రజలకు ఎప్పుడూ ఉండాలని ప్రజలు ఆయన ఆశించిన మార్గంలో నడిసి ఆయన ఆశ సాధనకు కృషి చేయాల్సిన అవసరం మన మానవాళిపై ఉందని మునిగడప పేర్కొన్నారు. అనంత స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు విజయగిరి రాజనంద చారి, నవీన్ చారి, పూజారి ప్రవీణ్, మద్దోజు గణేష్, సాగర్ భాగ్య లక్ష్మి, శృతి తదితరులు పాల్గొన్నారు.

## మే డే స్ఫూర్తితో కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

**ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ బాబు**



**కుషాయిగూడ, మహా :** మే డే స్ఫూర్తితో కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేద్దామని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ బాబు పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని నీలం రామచంద్రయ్య భవన్ లో మే డే ని పురస్కరించుకొని ఐఎఫ్టియు నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ బాబు మాట్లాడుతూ నల్ల చట్టాలతో బడా కంపెనీలకు బాటలు వేస్తూ కార్మికుల పొట్టను కొడుతున్న కార్పొరేట్ వ్యవస్థ ను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఏకమై మేడేను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయసుధ, కృష్ణ, మనమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చిన ఎమ్మెల్యే పాయం..

- **మున్నూరు కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి సహకారం..**
- **మున్నూరు కాపు సంఘం నేతలు కృష్ణమోహన్, సురేష్..**



**మణుగూరు, మహా :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించిన నాయకుడిగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిలిచారని మున్నూరు కాపు సంక్షేమ సంఘ నాయకులు పేర్కొన్నారు. మణుగూరు ప్రజాభవన్‌లో ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘ నాయకులు, ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్, కార్యదర్శి గాండ్ల సురేష్ లు మాట్లాడారు. మున్నూరు కాపు సంక్షేమ సంఘానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో కళ్యాణ మండప నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. అలాగే మున్నూరు కాపు సంఘ సభ్యులకు సముచిత రాజకీయ అవకాశాలు కల్పిస్తానన్న మాటను నిలబెట్టుకున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. బీసీల పక్షపాతిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయంకు సంఘ నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణ మండపం పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కావడానికి మరికొన్ని నిధులు వెచ్చించాలని కోరగా.. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ నాయకులు గువ్వా రాంబాబు, గోపిశెట్టి శివయ్య, మర్రి సారంగపాణి, ఊట్కూరు సత్యనారాయణ, బేతంచర్ల వెంకటేశ్వర్లు, గాజుల పూర్ణచంద్రరావు, పోట్ల ముత్తయ్య, మీసాల దుర్గారావు, మేడ నాగేశ్వరరావు, మాదాసు సాయిబాబా, బత్తిని రామచందర్, గాండ్ల మల్లయ్య, బడే రామ్మోహన్, తూపుడి శ్రీనివాస్, మిరియాల భాస్కర్, శ్రీకాంత్, రామకృష్ణ, యువజన నాయకులు అడబాల ప్రవీణ్, అమూల్ శ్రీనివాస్, సీనియర్ పత్రికా విలేకరులు పూజారి చందు, సత్యం బాబు, కార్మిక సంఘ నాయకులు ఆకుల నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మున్నూరు కాపులకు సముచిత స్థానం – ఎమ్మెల్యే పాయం**

మున్నూరు కాపులకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించడంలో తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

## ఏఐయూకెస్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

- **భద్రాచలం పట్టణంలో ఘనంగా నిర్వహణ**
- **రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు**



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలోని సిపిఎం ఎల్ మాస్టర్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (AIUKS) ప్రథమ జాతీయ మహాసభల పోస్టర్‌ను జాతీయ కన్వీనర్ కేచెల రంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026మే 11, 12, 13 తేదీలలో ఇల్లందు పట్టణంలో నిర్వహించనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం (AIUKS) ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు .ఈ మహాసభలకు ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన వడ్డే శోభనాదీశ్వరరావుతో పాటు పలు రాష్ట్రాల నుంచి రైతు నాయకులు హాజరై సభల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలు, వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులపై ఈ సమావేశాల్లో సమగ్రంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని రంగారెడ్డి పేర్కొన్నారు. అలాగే మే 11న భారీ రైతు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు కేచెల కల్పన, డివిజన్ నాయకులు సాయన్న, మునిగేలా శివప్రశాంత్, భాస్కర్, మహిళా సంఘం నాయకులు మహేశ్వరి, కుమారి, రమాదేవి, షకీరా, పీర్లోజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులు... వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేసుకోవాలి

- **కార్మికులకు పట్టణ ఉపాధి పథకాలు వర్తింపజేయాలి**
- **భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకింది అశోక్**



**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ ప్రాంత పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు వెల్ఫేర్ బోర్డులో తమ పేరును విధిగా నమోదు చేసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులకు పట్టణ ఉపాధి పథకాలు వర్తింపజేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింతకింది అశోక్ కోరారు. కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం సిఐటియు జవహర్ నగర్ డివిజన్ నాయకుడు టి. నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింతకింది అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ వెల్ఫేర్ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాలతో పాటు పట్టణ ఉపాధి పథకాలు రూపొందించి 200 రోజుల పని దినాలను కల్పించాలని ఈ సందర్భంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం కాప్రా సర్కిల్ జవహర్ నగర్ భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులుగా డి. నాగేష్ ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర వర్మ, రాము, కార్యదర్శిగా చింతకింది అశోక్, సహాయ కార్యదర్శిగా బాబు, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా లింగాల కవిత, కొమరయ్య, మహేందర్, ఆర్గనైజర్ గా కుమార్, రాము వీరితో పాటు కమిటీ సభ్యులుగా యాదగిరి, లింగయ్య, రాజు, లక్ష్మణ్, బలరాం, నాగరాజు, రాములు, నర్సింగ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఉద్యమ నాయకుడు శివన్నారాయణ హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పియం శ్రీ పాఠశాలలో టేబుల్ టెన్నిస్ కోచింగ్



**దమ్మపేట, మహా :** స్థానికంగా ఉన్న పియం.శ్రీ .జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కు వేసవి కోచింగ్ కేంద్రం ప్రారంభించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తాటి మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు చేత టేబుల్ టెన్నీస్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ టెన్నిస్ కోచింగ్ ను ఉపయోగించుకోవాలని కోరారు. జూన్ 7వ తేదీ వరకు ఉచితంగా అందించే ఈ కార్యక్రమంలో ఏ తరగతి విద్యార్థులైనా శిక్షణ తీసుకోవచ్చని సూచించారు.

## శ్రీయుగ ఎన్‌క్లేవ్‌కు నూతన కమిటీ ఎన్నిక

**సంక్షేమం – అభివృద్ధి దిశగా కృషి**



**కుషాయిగూడ, మహా :** కాప్రా సాకేత్ లోని శ్రీయుగ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రాబోయే కాలానికి నూతన గవర్నింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపిరెడ్డి మాల్యాద్రి రెడ్డి (జీఎంఆర్), ఉపాధ్యక్షుడిగా టి.ఎన్. సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా కొచెర్లకోట శ్రీకాంత్, కోశాధికారిగా పడమటి వెంకట రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా అరుపుల నర్సిములు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వర్ధనినాగరి రజిత, సైనీ అభిలాష్, కుప్పాని సురేష్, జవల్కర్ హరిప్రసాద్ ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్‌క్లేవ్‌లో మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రత, పారిశుద్ధ్యం, నివాసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల విజయవంతానికి మాజీ ఎమ్మెల్యే రేగా పిలుపు..



**మణుగూరు, మహా :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి గ్రామంలో గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగరవేయాలని, అలాగే మండల కేంద్రంలో మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ, అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని సూచించారు. ఈ వేడుకల్లో అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు, వార్డు కౌన్సిలర్లు, టీజీబీకేఎస్ నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటీసీలు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ స్థాపన దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఉత్సాహంగా జరుపుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి తోడ్పడాలని కోరారు.

## డి.గొల్లగూడెంలో బడిబాట



**దమ్మపేట ,మహా :** మండల పరిదిలోని దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. 99రోజుల ప్రజాపాలన ప్రణాళిక లో భాగంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చంద్రకళ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు ,ఉపాధ్యాయులు హాజరయ్యారు.

# సారపాకలో అపశృతి

**వినాయక ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్టలో ప్రమాదం**

### స్తంభం విరిగి ముగ్గురికి గాయాలు..
### తలకు బలమైన గాయంతో చిన్నారి పరిస్థితి విషమం

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక ప్రధాన రహదారి పక్కనే ఉన్న వినాయక ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తుండగా ఊహించని ప్రమాదం సంభవించింది. భారీ ధ్వజస్తంభం ఒక్కసారిగా విరిగి భక్తులపై పడటంతో ఒక చిన్నారికి, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

**అసలేం జరిగింది?**

ఆదివారం ఉదయం ఆలయ నిర్వాహకులు క్రేన్ సహాయంతోధ్వజస్తంభాన్ని నిలబెట్టే ప్రయత్నం చేశారు. స్తంభాన్ని నిలువుగా పైకి లేపుతున్న క్రమంలో, లోడ్ భరించలేక లేదా సాంకేతిక లోపం వల్ల ధ్వజస్తంభం ఒక్కసారిగా మూడు ముక్కలై కింద పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న భక్తులు భయంతో పరుగులు తీశారు. అయితే, అక్కడే ఉన్న ఒక చిన్నారి తలకు స్తంభం ముక్క బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. మరో మహిళకు సైతం గాయాలయ్యాయి.

**ఆసుపత్రికి తరలింపు**

ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన భక్తులు, స్థానికులు తీవ్రంగా గాయపడిన చిన్నారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

**నిర్వాహకులపై భక్తుల ఆగ్రహం**

ఈ ఘటనపై స్థానికులు మరియు భక్తులు తీవ్ర గ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధ్వజస్తంభం వంటి భారీ పనులు చేపడుతున్నప్పుడు కనీస భద్రతా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు మండిపడుతున్నారు. క్రేన్ నాణ్యత లేదా స్తంభాన్ని కట్టే విధానంలో లోపాలు ఉన్నాయని, నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే పవిత్రమైన కార్యం కాస్తా రక్తసిక్తమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## హ్యాండ్‌బోర్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలం గాంధీ బొమ్మ సెంటర్, నేరేళ్ల చెరువు కట్ట వద్ద ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌బోర్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక రైతులు నూతన పశువైద్యశాల ఏర్పాటు, బతుకమ్మ ఘాట్ వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించడం, సీసీ రోడ్ల నిర్మాణం వంటి సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ వినతులపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాతూరి వెంకన్న, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, నాయకులు కురం రవి, క్రిష్ణ, మహిళా నాయకులు, స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా చిలుకూరి రమేష్ నియామకం

**శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన బిజెపి పార్టీ నాయకులు**



**జూలూరుపాడు, మహా:** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జూలూరుపాడు గ్రామానికి చెందిన చిలుకూరి రమేష్ నియామకం పట్ల పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనరసయ్య నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, మండల పార్టీ నాయకులు రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపి, స్వీట్లు తినిపించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. రమేష్ నియామకం పట్ల రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా పాటిస్తూ, అంచలంచలుగా ఎదుగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి జిల్లా నాయకులు నున్న రమేష్, బిజెపి మండల అధ్యక్షులు భూక్య రమేష్, ఆర్ఎస్ఎస్ జూలూరుపాడు ఖండా కార్యవాహ శ్రీనాథరాజు శ్రీనివాసు, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, యువ మోర్చా మండల అధ్యక్షులు గుగ్లోత్ రాంబాబు, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, గోపాలరావు, నర్వనేని కృష్ణ, వందనపు సుబ్బు, చిలుకూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 27-04-2026
సాహిత్యం LITERATURE 04

# గీర్ అడవికి అక్షర రూపం...

## యోగేష్ వైద్య కవిత్వ దర్శనం

ఎండిన టేకు ఆకు రాలిన చప్పుడు గీర్ అంతటా వ్యాపించింది,నిశ్శబ్దమైన గోరువంకలు, చిలుకల మధ్య అడవి మెల్లగా రాలిపోతోంది.దూర తీరాన బూడిద రంగు పక్షి ఒకే స్వరంతో ఆగిపోయింది,అక్కడక్కడ మోదుగ చెట్టు ఊగుతూ, గాలి గరుకు వీపును గోకుతోంది.నేల పగుళ్లలో పుప్పొడి రాలి పడుతోంది, చీమలు ఆ కణాలను భర్తీ చేస్తున్నాయి ,ఒంటరి బాట దుమ్ము కుప్పలను చెదరగొడుతూ తనలో తానే బాధ పడుతోంది.తొందరపడిన మోదుగ పూలు ఉదయపు రక్త వర్ణంలా వికసించాయి, నిశ్శబ్దమైన గోరువంకలు చిలుకల మధ్య అడవి మెల్లగా రాలిపోతోంది. మొండి కరమదా పొదలు తలలు పైకెత్తాయి, చంద్ర, జమ్మి చెట్లు ముళ్లను విదుల్చుతున్నాయి,గురివింద తీగ నుండి రాలిపడుతున్న ఎర్రని చుక్కలు నేలపై పరుచుకున్నాయి.ఎండుటాకుల శబ్దానికి అడవి కోళ్లు భయపడుతున్నాయి, కోతులు వెర్రిగా ప్రవర్తిస్తున్నాయి,చిన్న పక్షులు చెట్ల రంగులను మాటిమాటికీ అద్దుతూ గాఢం చేస్తున్నాయి.రాళ్ల కింద సెలయేళ్లు తచ్చాడుతున్నాయి, నీటిలో తమ ప్రవాహాన్ని వెతుక్కుంటున్నాయి,నిశ్శబ్దమైన గోరువంకలు చిలుకల మధ్య అడవి మెల్లగా రాలిపోతోంది.

**(యోగేష్ వైద్య -భట్ ఖడకీ నుండి)**

గుజరాత్ లోని గిర్ అడవుల గురించి మనం చాలా సార్లు చదివి, విని ఉంటాము.కానీ ఈ కవిత మన పఠన,శ్రవణ అనుభవాలను పక్కకు నెట్టేసి మనలని ఒక అద్భుతమైన లోకం లోకి తీసుకుని వెళుతున్నది. యోగేశ్ వైద్య రాసిన ఈ కవిత గీర్ అడవిలోని ఆకురాలు కాలాన్ని ఒక నిశ్శబ్ద చిత్రపటంలా మన కళ్లముందు ఉంచుతుంది. అడవిలో ఎండిన టేకు ఆకు రాలినప్పుడు వచ్చే అతి చిన్న శబ్దం కూడా గీర్ అంతటా ప్రతిధ్వనిస్తోందని చెప్పడం ద్వారా, అడవిలోని గాఢమైన నిశ్శబ్దాన్ని కవి పాఠకుడి హృదయంలోకి అనువదిస్తున్నారు.. సాధారణంగా ఆకురాలు కాలం అంటే శుష్కించిపోవడం అనిపిస్తుంది, కానీ ఇక్కడ అడవి "మెల్లగా రాలిపోతోంది" అని వర్ణించడంలో ఒక రకమైన త్యాగం, ఒక ధ్యాన స్థితి కనిపిస్తుంది. గోరువంకలు, చిలుకలు మౌనంగా ఉండి ఈ మార్పును గమనిస్తున్నట్లుగా ఉండటం అడవిలోని గంభీరతను దృశ్యమానం చేస్తుంది

మోదుగ చెట్టు, గాలి గరుకు వీపును గోకడం, ఒంటరి బాట తనలో తాను బాధపడుతూ దుమ్ము కుప్పలను చెదరగొట్టడం వంటి పద ప్రయోగాలు అడవిని ఒక సజీవ ప్రాణిగా మనకు పరిచయం చేస్తాయి. నేల పగుళ్లలో రాలిపడే పుప్పొడి ని చీమలు ఏరుకోవడం ప్రకృతి లోని నిరంతర జీవన చక్రాన్ని సూచిస్తుంది. అలాగే, రక్త వర్ణంలో వికసించిన మోదుగ పూలు ఆకురాలు కాలపు వెలవెలబోయిన రంగుల మధ్య ఒక కొత్త ఉత్తేజాన్ని, ఆశను నింపుతాయి.

అడవిలోని వృక్షజాలం మరియు జంతుజాలం మధ్య ఉన్న సంబంధాన్ని కవి చాలా సున్నితంగా చిత్రించారు. చంద్ర, జమ్మి చెట్లు ముళ్లను విదుల్చుకోవడం, గురివింద తీగ నుండి ఎర్రని చుక్కల్లా గింజలు రాలడం వంటివి గీర్ అడవికే పరిమితమైన ప్రత్యేక దృశ్యాలు. ఎండుటాకుల గలగల శబ్దానికి అడవి కోళ్లు భయపడటం, కోతులు వింతగా ప్రవర్తించడం వంటివి అడవిలోని సహజ సిద్ధమైన అలజడిని ప్రతిబింబిస్తాయి. రాళ్ల కింద దారి వెతుక్కునే సెలయేళ్లు, తమ ప్రవాహాన్ని తామే వెతుక్కుంటున్నాయని చెప్పడం ద్వారా ప్రకృతిలోని నిరంతర అన్వేషణను కవి చాటిచెప్పారు. యోగేష్ వైద్య రాసిన గిర్ అడవిలో ఆకురాలు కాలాన్ని కేవలం ఆకులు రాలే సమయంగా కాకుండా, ప్రకృతి మౌనంగా తనని తాను పునర్నిర్మించుకునే ఒక సుందర ప్రక్రియగా మనకు చూపిస్తుంది.

**ఎవరీ యోగేష్ వైద్య**

యోగేష్ మధుసూదన్ వైద్య గుజరాతీ సాహిత్య రంగంలో తనదయిన ముద్ర వేసిన ప్రముఖ కవి. గ్రామీణ అటవీ ప్రాంతాల జీవనశైలిని తన కవిత్వంలో అద్భుతంగా ఆవిష్కరించే ఆధునిక కవి. 1962లో గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా బగసరాలో జన్మించిన ఆయన, వృత్తిరీత్యా సివిల్ ఇంజనీర్ అయినప్పటికీ ప్రవృత్తిరీత్యా సాహిత్యంపై మమకారాన్ని పెంచుకున్నారు. ఆయన కవిత్వంలో సౌరాష్ట్ర ప్రాంతపు భౌగోళికత, గీర్ అడవి అందాలు అక్కడి అటవీ గ్రామాలలో నివసించే మనుషుల జీవనవేదనలు ప్రధానంగా కనిపిస్తాయి. 1998లో వెలువడిన 'హు జ దరియో, హు జ భేఖడ్' అనే కవితా సంపుటితో గుర్తింపు పొందిన ఆయన, సుదీర్ఘ విరామం తర్వాత 'భట్ ఖడకీ' (2023) 'నేఖమ్' (2025) వంటి ప్రశంసనీయమైన రచనలను అందించారు. కవిత్వంలో విస్మరణకు గురవుతున్న గ్రామీణ సంవేదనలను, సంప్రదాయ ఛందస్సులను పునరుద్ధరించడం ఆయన కవిత్వ శైలి లోని ప్రత్యేకత. గిర్ అడవిలోని సింహాల గురించే కాకుండా, అక్కడి గాలి, మట్టి, సామాన్య ప్రజల కట్టుబాట్లు ప్రకృతిలోని సున్నితమైన మార్పులను ఆయన తన కలంతో చిత్రపటంలా మలుస్తారు. 2025 సంవత్సరానికి గాను ఆయన తన 'భట్ ఖడకీ' కవిత్వ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు.ప్రకృతిని కేవలం వస్తువుగా కాకుండా ఒక అనుభూతిగా మార్చి పాఠకులకు అందించడం యోగేష్ వైద్య కవిత్వంలోని అసలైన సారం

యోగేష్ వైద్య 'భట్ ఖడకీ' కవిత్వసంపుటి ని 2023 లో వెలువరించారు. 'ఖడకీ' అంటే గుజరాతీలో ఇంటి ప్రధాన ముఖద్వారం లేదా వాకిలి అని అర్థం ఆధునిక గుజరాతీ సాహిత్యంలో ఒక విశిష్టమైన మైలురాయిగా ఈ కవిత్వ సంపుటి నిలిచింది. సౌరాష్ట్ర ప్రాంతపు గ్రామీణ జీవన సంస్కృతిని, ముఖ్యంగా గీర్ అడవి పరిసరాల్లోని మనుషుల అంతరంగాలను అత్యంత సహజంగా ఈ కవిత్వ సంపుటి ఆవిష్కరిం చింది .




కవి తన బాల్య జ్ఞాపకాలను, మారుతున్న కాలంలో కనుమరుగవుతున్న పాత తరం విలువలను ఈ వాకిలి గుండా పాఠకులకు పరిచయం చేస్తారు. ఈ కవితలలో కేవలం ప్రకృతి వర్ణనలే కాకుండా, అడవిలో నివసించే మాల్ధారీలు (పశుపోషకులు) సామాన్య ప్రజల దైనందిన పోరాటాలు, వారి భాషా సొబగులు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ సంపుటిలోని కవిత్వం శైలి పరంగా చాలా ప్రత్యేకమైనది. యోగేష్ వైద్య గుజరాత్ లో ఇప్పుడు అంతగా వాడకంలో లేని సంప్రదాయ 'మాత్రామేళ' ఛందస్సులను ఉపయోగించి, పాత కొత్తల కలయికగా ఈ కవితలను మలిచారు. 'భట్ ఖడకీ'లోని 'గీర్ నా నేస్ మా రాత్' వంటి కవితలు అడవిలోని భయం, నిశ్శబ్దం జీవన అస్తిత్వాన్ని ఏకకాలంలో పలికిస్తాయి. విస్మరణకు గురి అయిన గ్రామీణ సంవేదనలను అత్యున్నత సాహిత్య విలువలతో తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చినందుకు గాను ఈ రచన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సంపుటిలోని సృజనాత్మకత ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే గుణం కారణంగానే దీనికి 2025లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

యోగేష్ వైద్య కవిత్వం అంతా గ్రామీణ ప్రాంతాల చుట్టూ, సౌరాష్ట్ర చుట్టూ తిరుగుతూ ఉంటుంది . అతడు రాసినదే మరొక కవిత చూడండి . గిర్ అడవుల పాదాల దగ్గర వున్న ఒక చిన్న గ్రామం గురించి ఈ కవిత. ఆ గ్రామం పేరు గుండాల. ఈ కవిత పేరు కూడా గుండాల నే గుండాల గుండాల ఒక చిన్న పల్లెటూరు గిరి (గిర్ అడవి) పదకొండవ వేలికి జిగురు పండు గింజలా అతుక్కుపోయింది

ఆవుల గిట్టల మధ్య నలిగే వీధులు,
ఎడ్ల గంటల గంభీరమైన మోతలు
రాందల్ మాత ఉత్సవంలో గుర్రం చిందులేసినట్లుగా
ప్రతి వాకిలి, వరండా ఆ ఉత్సాహంలో మునిగి తేలుతాయి. అమ్మాయిలు వరండాల్లో నెమళ్ల ముగ్గులు తీర్చిదిద్దుతారు, అమ్మ కంటిచూపులాగా వాకిళ్లు శుభ్రంగా మెరుస్తాయి. ఒక కుట్టుపనివాడు, ఒక స్వర్ణకారుడు, ఒక కుమ్మరి, ఒక వడ్రంగి, ఇద్దరు బ్రాహ్మణులు, కొందరు కాఠీలు ఇంకా సామత్ భర్వాడ్లు మిగిలిన సగంలో కణబీలు,ఇంకో సగంలో సోరఠ్ ఆహిర్లు ఇలా రెండు భాగాలు.మంత్రి లెక్కల ప్రకారం జనాభా పదిహేను వందలే,కానీ తలల లెక్క చూస్తే మూడు వేలు!
(గ్రామమంతా రెండు తలల మనుషులని తెలుసుకోండి!)

అక్కడ పుచ్చకాయలంత పరిమాణంలో టమాటాలు పండుతాయి,
కత్తులంత పొడవుగా చిక్కుడు కాయలు కాస్తాయి!



పగలు కూడా బజారులో సింహం (బవకో) గంభీరంగా తిరుగుతుంది,
అయినా ఎవరికి ధైర్యం దాన్ని ఎదిరించడానికి?
అక్కడి ఆడపిల్లలు ఎంత ధైర్యవంతులంటే,
పిడకలు ఏరడానికి వెళ్ళిన వారు
సింహం అడుగుజాడలను ఏరుకొని వస్తారు.
పొలాల కంచెల్లో చిరుతపులి పిల్లలు ఆడుకుంటుంటే
గ్రామంలోని తల్లుల రొమ్ముల నుండి పాలు ఉబికి వస్తాయి.
భూపత్ బార్వటియా (దోపిడీ దొంగ) వల్ల గానీ,
మహమ్మారి వల్ల గానీ ఈ గ్రామం చెక్కుచెదరలేదు.
సింహం తాగిన మిగిలిన నీటినే అందరూ తాగుతారు
ఇక్కడ కేవలం 'భూతడియా దేవుని' ఆజ్ఞ మాత్రమే నడుస్తుంది.

గ్రామ జనాభా లెక్క ఎప్పుడూ తగ్గదు,
ఒకరు జన్మిస్తే, ఇంకొకరు మరణిస్తారు q
ఇది భూతడియా దేవుని తిరుగులేని శాసనం.

అవును, తిరుగులేని శాసనం.
తులసి మాలలోని మేరుమణి వంటి గోరదా (పూజారి),
రాముడి నామంతో పెంకుటింట్లో జీవిస్తున్నారు.
అకస్మాత్తుగా ఆయన ప్రాణదీపం ఆరిపోయింది.
పూల పాన్పుపై ఆయన దేహాన్ని పడుకోబెట్టి,
జనం పడమర దిశగా సాగిపోయారు.

గ్రామాన్ని తాకుతూ గలగలా పారే వాగు,
అవతలి ఒడ్డున శివాలయం.
ప్రవాహం మధ్యలో ఒక బండరాయి,
ఆ రాయిపై అడవి కట్టెలతో చితి పేర్చారు,
చందన లేపనంతో దేహాన్ని సాగనంపారు.
ఇరువైపులా మౌనంగా కూర్చున్న జనం,
నిర్లిప్తంగా పారే వాగు,
నిర్లిప్తంగా కాలుతున్న కట్టెలు, ఎముకలు,
నిర్లిప్తంగా నిలబడిన అడవి, చెట్లు..

శరీరంతో ఉన్న రుణానుబంధం తెంచుకొని,
బూడిద నీటి ప్రవాహంలో కలిసిపోయింది.
చితి చల్లారాక అందరూ వెనుదిరిగి,
వాకిలిలో దిగులుగా కూర్చున్నారు.
అంతలో పక్క వాకిలి నుండి కంచం వాయిస్తూ,
సమ్జుమ్మ ఆనందంగా ఇలా అన్నారు:
"వినండి బుద్ధిమంతులారా, వినండి!
మా అమృతకు కొడుకు పుట్టాడు..."

ఓ భూతడియా దేవా!
నీవు నీ శాసనాన్ని నిలబెట్టుకున్నావు,
గ్రామ జనాభా లెక్క తగ్గనివ్వలేదు.

అతి చిన్నారి గ్రామం
గిరి పదకొండవ వేలికి
జిగురు పండు గింజలా అతుక్కుపోయింది.

చిరుతపులి పిల్లలు పొలాల్లో ఆడుకుంటుంటే, గ్రామంలోని తల్లుల హృదయాలు వాత్సల్యంతో ఉబికి రావడం మనుషులకు, అడవి మృగాలకు మధ్య ఉన్న విడదీయలేని అనుబంధాన్ని చూపుతుంది. దోపిడీ దొంగలు గానీ, మహమ్మారి గానీ ఆ గ్రామాన్ని ఏమీ చేయలేకపోయాయి, ఎందుకంటే అక్కడ 'భూతడియా దేవుని' అదృశ్య రక్షణ మరియు కఠినమైన శాసనం నడుస్తుంటుంది.కవిత చివరలో ఒక వృద్ధ పూజారి మరణం, అదే సమయంలో ఒక శిశువు జననం ద్వారా కవి జీవిత పరమార్థాన్ని, ప్రకృతిలోని సమతుల్యతను అద్భుతంగా చిత్రించారు. పూజారి చితి నిప్పుల్లో కాలి బూడిద వాగులో కలిసిపోతున్నప్పుడు అడవి, చెట్లు, వాగు అంతా నిర్లిప్తంగా ఉండటం ప్రాపంచిక బంధాల నుంచి విముక్తిని సూచిస్తుంది. అయితే ఆ మౌనాన్ని ఛేదిస్తూ పక్క వాకిలిలో కంచం మోగించి ఒక బిడ్డ పుట్టాడన్న వార్త వినబడటం 'భూతడియా దేవుని' శాసనాన్ని గుర్తు చేస్తుంది. ఒకరు మరణిస్తే మరొకరు పుట్టి తీరాలనే ఆ అచంచలమైన నియమం వల్ల గ్రామ జనాభా లెక్క ఎప్పుడూ తగ్గదు. జనన మరణాల ఈ చక్రం గీర్ అడవి అంచున ఉన్న ఆ చిన్న గ్రామంలో నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని కవి ఈ కవిత ద్వారా సార్వజనీన సత్యాన్ని చాటి చెప్పారు.

వైద్య ది మరొక కవిత గీర్ నెస్‌లో రాత్రి. గీర్ నెస్‌లో రాత్రి అంటే ఒకే పదం అనుకుంటాము కానీ ఇక్కడ గిర్ అంటే అడవి, నెస్ అంటే అడవిలో వుండే నివాస ప్రాంతం ఒక పాక లాంటిది
గీర్ నెస్‌లో రాత్రి (కవిత)
యోగేష్ వైద్య

బూడిద రంగు ఆకుల గాలిలో ఒక చంద్రుడు మెరుస్తున్నాడు, రెండవ చంద్రుడు పొయ్యి నుండి నేరుగా ఇత్తడి కంచంలోకి దిగుతున్నాడు. తాజా వేడి పాల గిన్నెలు మీసాల నోళ్లకు అందుతున్నాయి, గీర్ అడవి నల్లని రాత్రి ఒక భారీ మొద్దులా పశువుల పాకలో ఒరిగింది. రగులుతున్న మంటల వెలుగులో మొరటు ముఖాలు కనిపిస్తున్నాయి,వాకిలి మధ్యలో చలిమంటలు మండుతూ నెస్‌కు కాపలా కాస్తున్నాయి.దగ్గరలోనే గర్జిస్తున్న సింహం, నీటి కుండలో అడవి నాలుకతో చప్పరిస్తోందిగూబ అరుస్తూ ఎగురుతోంది,

చెట్టు మాత్రం నిశ్శబ్దంగా గడగడలాడుతోంది.అడవిపై చీకటి తన కఠినమైన చేతిని ఉంచింది,ఒక పెద్ద కొండచిలువ చుట్టుముట్టినట్లు నిశ్శబ్దం అల్లుకుపోతోంది. ఎక్కడో జింక గొంతు నులిమినట్లు, ఎక్కడో పాము పాకినట్లు,నిశ్శబ్ద ప్రాణాల వీడ్కోలు గాలిలో కలిసిపోతోంది. ఎదురుగా ఉన్న కొండపై వేటను తింటూ సింహబలి గర్జిస్తోంది, దాని పిల్లలు పక్కటెముకలను పీకుతూ, ఒకదానితో ఒకటి ఆడుకుంటున్నాయి. కళ్లు మూసుకుని గాలిని ఆఘ్రాణిస్తూ కూర్చున్న సాంబార్ల గుంపు, ఉదయం అయ్యేసరికి ఈ వాకిలిలో జనాభా తగ్గుతుందని తెలుసు.

గీర్‌ను అర్థం చేసుకోవాలంటే అక్కడ నివసించాలి. మేఘాణి నుండి ధ్రువ్ భట్ వరకు చాలా మంది రచయితలు గీర్‌ను వర్ణించారు, ఆ వరుసలో తాజా పేరు యోగేష్ వైద్య. ఈ కవితలో రాత్రికి రెండు విశేషణలు ఉన్నాయి. అది గీర్ అడవి రాత్రి అది ఒక నెస్‌లోని రాత్రి. అక్కడ ఆకలితో ఉన్నవాడికి కంచంలో ఉండే 'రోట్టె' కూడా చంద్రుడిలాగే కనిపిస్తుంది.

కవి వాడిన 'కటావ్' (Katav) ఛందస్సు ఆ వాతావరణానికి తగ్గట్టుగా ఉంది. తాజా పాలను తాగుతున్న మీసాల మనుషులు, పశువుల పాకలో నిశ్శబ్దంగా ఉన్న రాత్రి ఇవన్నీ గీర్ వాస్తవికతను కళ్లకు కడతాయి.చలి మంటల వెలుగులో కనిపించే మనుషుల ముఖాలు, దగ్గరలో సింహం నీళ్లు తాగే శబ్దం, భయంతో స్తంభించిపోయిన చెట్లు ఇవన్నీ అడవిలోని భయంకరమైన నిశ్శబ్దాన్ని మనకు అనుభూతి చెందిస్తాయి. ఒక కొండచిలువ తన బంధీని చుట్టేసినట్లుగా చీకటి అడవిని అల్లుకుందని కవి వర్ణించారు. ఒకవైపు సింహం తన వేటను తింటూ గర్జిస్తుంటే, మరోవైపు సాంబార్ల గుంపు భయంతో గాలిని పీలుస్తూ కూర్చుని ఉంటాయి. తెల్లవారేసరికి తమలో ఎవరో ఒకరు ఆహారమైపోతారని వాటికి తెలుసు.ఈ కవిత చదువుతుంటే, మనం ఒక కవిత చదువుతున్నామనే విషయం మరిచిపోయి, ఆ గీర్ అడవిలోని నెస్‌లో ఉన్నామన్న అనుభూతి కలుగుతుంది. యోగేష్ వైద్య మ్యాజిక్ అది

యోగేష్ వైద్య కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది గీర్ అడవి యొక్క ఆత్మఘోష. ఆయన రాసిన 'గీర్ మా పాన్థర్', 'గుండాల', 'గీర్ నెస్‌లో రాత్రి' వంటి కవితలు చదువుతుంటే పాఠకుడు అక్షరాలను దాటి అడవిలోని మట్టి వాసనను, ఆకుల గలగలలను, వన్య ప్రాణుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలను స్వయంగా అనుభూతి చెందుతాడు. ప్రకృతిని మనుషులకు దూరంగా ఉండే ఒక వస్తువుగా కాకుండా, మానవ జీవితంతో పెనవేసుకున్న ఒక సజీవ సాక్షిగా ఆయన చిత్రించారు. నాగరికతకు దూరంగా, అడవి ఒడిలో సాగే మాల్ధారీల జీవితాలను, వారి సాహసాన్ని, జనన మరణాల చక్రాన్ని నిశ్శబ్దంగా గమనిస్తూ సాగే ఆయన శైలి అద్వితీయం.

ముఖ్యంగా, అడవిలోని క్రూరత్వాన్ని కూడా ఒక సహజ సిద్ధమైన జీవన సూత్రంగా అంగీకరిస్తూ, మృగాలకు మనుషులకు మధ్య ఉండే అదృశ్య అనుబంధాన్ని ఆయన ఆవిష్కరించిన తీరు గుజరాతీ సాహిత్యంలోనే కాకుండా సమకాలీన భారతీయ కవిత్వంలోనూ ఆయనకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. యోగేష్ వైద్య కవిత్వం చదివిన తర్వాత గీర్ అడవి అంటే కేవలం సింహాల నివాసం మాత్రమే కాదు, అది నిరంతరం తనని తాను పునర్నిర్మించుకునే ఒక మహోన్నత శక్తి అని, అక్కడ రాలే ప్రతి ఆకులోనూ ఒక కథ ఉంటుందని మనకు అర్థమవుతుంది. ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న మట్టి సంవేదనలను అక్షరబద్ధం చేస్తూ, ప్రకృతి ఒడిలో మనిషి ఎంత అల్పుడో మరియు ఎంత ధన్యుడో గుర్తుచేయడమే ఈ కవిత్వంలోని అసలైన పరమార్థం.

**- వంశీ కృష్ణ,**
**95734 27422**

## నీలాంబరి (కవిత)

నీలాంబరీ..
సంకెళలెరుగని కాలం
దాహమెరుగని దేహం
ఎప్పుడైనా ఉన్నాయా
ఉష్ణమెరుగని ఊపిరి
యాతనెరుగని తలపు
ఎక్కడైనా ఉండి ఉంటాయా
కన్నార్పని నిట్టూర్పులు
నిలువుకోతల్లేని నిబ్బరం
ఏనాడైనా ఉన్నాయంటావా

నువ్వు నీలిమేఘానివో
నీలాల కమలానివో
ప్రయోగించబడిన
ప్రళయానివో
నిలదీసే నియమావళివో
నీవెవరైనా సరే

నేను వధ్యశిలకు సిద్ధమే
నీ చూపుల ఫిరంగులతో
నా కలల కల్లోలాలను
భరిస్తూనే ఉన్నాను

నీవు వరదైవస్తే
నేను వారధిలా విచ్ఛిన్నమౌతా
నీవు మత్తడిలా వచ్చినా
చిత్తడిలాగా కొట్టుకుపోతా
నీవు కోరచూపులు చూసినా
ఆ కారడవుల్లో చిరునవ్వులతో
విహరిస్తూనే ఉంటాను
చెదిరిన నీ అదరాల
పూదోటలో తేనియనై
స్రవిస్తూనే ఉంటాను

నాకు వెన్నెల్లంటే మక్కువ
నీ ఒళ్లన్నీ అల్లుకున్న
తారలంటే ఇష్టం
విద్యుల్లతలై విరజిమ్ముతావో
ఉరుమై ప్రళయగర్జన చేస్తావో

నీ ఉచ్ఛ్వాస నిశ్వాస
తరంగాల్లో ఊరేగాలి
నీ ఢమరుకముల
లబ్ డబ్ ల సంగీతం వింటూ
ఆదమరచి నిద్రించాలని ఉంది

నీలి కన్నులు వాల్చకుండా
నన్నే చూస్తూ ఉండు
నేనూ నిన్నే చూస్తూ ఉండిపోతా

**- పర్కపెల్లి యాదగిరి,**
**92999 09516**

## వెలుగు నీడలు

పిలక పెట్టుకొని రాట్నం వడికితే
మహాత్మ గాంధీ కాలేరు

బేడీల చేతులకు పూలదండలు చుడితే
స్వాతంత్ర్య సమర యోధులు కాలేరు

మనసు విరిగినవాళ్ళ బాధ
పగిలిపోయిన బెలూనంత తేలికకాదు

సమాధుల దగ్గర పన్నీరు చల్లితే
దుఃఖించే వాళ్ల కన్నీళ్లు చల్లారవు

చలి పోవడానికి కట్టెల మంట వేసుకొన్నట్టు
కష్టాలు తీరడానికి స్వెట్టర్లేమీ వుండవు

జనాలకు అన్నీ తెలుసు
కథలకు వెతలకు ముగింపు తెలుసు

చెమట, అశ్రువులు, అత్తరు ఒకటి కాదు
దాహం, కోపం, పోరాటం ఓటములు కాదు

గుడిమీద లేచిన పక్షుల భాష
పడవలమీద వీచే పవనాల ఘోష
ఆకలితో పాచిక లాడే ప్రజలకు తెలుసు

**- ఆశారాజు, 93923 02245**

### తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో..

డా.చెమన్ రచించిన 'కుమ్మరికుంటోని కథలు' కథా సంపుటి ఆవిష్కరణ తేదీ 28 ఏప్రిల్ మంగళ వారం సాయంత్రం 5.30 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరుగుతుంది.
దేశపతి శ్రీనివాస్ సభాధ్యక్షత వహించే
ఈ సభకు ముఖ్య అతిథి & ఆవిష్కరణ డా. నందిని సిధారెడ్డి...
పుస్తక సమీక్ష: ప్రో. కాశీం,
విశిష్ట అతిథులు: డా. ఏనుగు నరసింహ రెడ్డి IAS,
డా. నామోజు బాలాచారి, పెద్దింటి అశోక్ కుమార్, స్వర్ణ కిలారి.
ఆత్మీయ సందేశం: బుర్ర తిరుపతి, బెజ్జారపు వినోద్ కుమార్.
సభా నిర్వహణ: ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
సాహితీమిత్రులు, భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి.

### రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

### పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## తొలి తెలంగాణ కవయిత్రి కుప్పాంబిక

భారతీయ సాహిత్యంలో ప్రతి తరంలోనూ ప్రతి కాలంలో కవయిత్రులు,రచయిత్రులు తమదైన విశిష్ట పాత్ర పోషించిన వారిలో ఒక మీరాభాయి,ఒక అవ్వైయార్,ఒక కుప్పాంబిక,ఆండాల్, అక్కమహాదేవి,జనాబాయి ముక్తాబాయి,కృష్ణ నీరాల వంటి వారున్నారు. ఇక సాహిత్యంలో కుప్పాంబిక,మొల్ల,తాళ్ళపాక తిమ్మక్క,పి.యశోదారెడ్డి,నాయిని కృష్ణ కుమారి,ముప్పాతిక రంగనాయకమ్మ, ఛాయాదేవి, సరోజినీ నాయుడు, మహాదేవి వర్మ,మహాశ్వేతాదేవి, అరుంధతీ రాయ్ వంటి రచయుతలు ఎందరో కలరు. కుప్పాంబిక 12వ,శతాబ్దానికిచెందిన తొలి తెలంగాణ కవయిత్రిగా పేరొందినారు. తెలుగులో ప్రసిద్ధ తొలి రామాయణంగా వెలిసిన రంగనాధరామాయణం కృతి కర్త గోనబుద్ధారెడ్డి కూతురు,గోన గన్నారెడ్డి సోదరియైన కుప్పాంబిక కాకతీయుల కాలం నాటి కవయిత్రి.ఆమె 1230న పుట్టిన పాలమూరు బిడ్డ.ఆమెకు తండ్రి వారసత్వంగా సాహిత్యం అబ్బింది. ఆమె భర్త మల్యాల గండనాథుని ఆస్థాన కవుల స్ఫూర్తితో కుప్పాంబిక సాహిత్య మెరుగులు దిద్దుకున్నట్లు చారిత్రక ప్రతీతి పొందారు. తొలి తెలుగు రామాయణ కర్త అయిన గోన బుద్ధారెడ్డి కుమార్తె కుప్పాంబిక. తొలి తెలుగు కవయిత్రిగా గుర్తింపు పొందిన ఆమె మల్యాల గుండనాథుని భార్య. తన భర్త మల్యాల గుండనాథుడు మరణించిన తర్వాత ఆమె బూదపురం (నేటి భూత్పూరు) లో సా.శ.1276లో ఒక శాసనం వేయించింది.ఈమె రచనలు కాని, వాటిపేర్లు కాని లభ్యంలో లేవు. అయినను, అయ్యలరాజు తన సంకలన గ్రంథంలో కుప్పాంబిక పద్యాలను ఉదహరించడం బలమైన సాహిత్య చారిత్రక ఆధారం. అందుకే గోన బుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక చరిత్ర కేవల కల్పనా కథ కాదు. శాసన ఆధారాలు ఉన్న అస్తిత్వం ఆమెది. రంగనాథ రామాయణాన్ని ద్విపదగా రాసిన మహాకవి బుద్ధారెడ్డి,అతని కొడుకులిద్దరూ కూడా (జంట) కవులే. కాచ భూపతి, విట్ఠల రాజు ద్విపదలోనే ఉత్తర రామాయణం రాశారని ఆ కావ్యమే చెబుతుంది. వారి తోబుట్టువే కుప్పాంబిక. ఈమె మల్యాల గుండనాధుని భార్యామణి. భూస్వామ్య భావజాలం ప్రభావంలో పుట్టిపెరిగిన పదజాలం ఆధారంగా కుప్పాంబిక వీరపుత్రి, వీరపత్ని కూడా. అయితే 1270 దశకంలో గుండయ్య చనిపోయిన తర్వాత, కుప్పాంబికే పాలన పగ్గాలు చేపట్టిందంటారు.దీని ఆధారంగా కుప్పాంబిక క్రీ.శ. 1230లో జన్మించిందని చరిత్రకారుల నిరాధారణ. అప్పటికి ఆమెకు దాదాపు 40 సంవత్సరాల వయసు. అంచేత ఆమెని వీర వనితగా భావించవచ్చు. అందుబాటులో ఉన్న ఒక పద్యం ఆమె రచనా శైలికి నిదర్శనం. అదే



'నవజాతాంబకు డేయు సాయకములన్ వర్జింపగా రాదు, నూ తన బాల్యాధిక వనంబ మదికిన్ ధైర్యంబు రానీయ దత్యనురక్తిన్ మిముబోంట్లకున్ దెలువ నాహా! సిగ్గుమైకోదు, పావన వంశంబు స్వతంత్రమీయదు, చెలీ! వాంఛల్ తుదల్ముట్టునే' భావోద్వేగ తాత్పర్యం చూస్తే ఉక్కిరిబిక్కిరి చేసే 'యువయవ్వనం' ఎవరినీ క్షమించదనీ 'వాంఛల్ తుదల్ముట్ట'డం కూడా సహజమనే జీవావస్థ,అలాగే సిగ్గు కూడా ఎవరికీ తప్పని ఓ సహజావస్థ. వీటన్నిటికీ తోడు, గొప్ప వంశంలో పుట్టిన వారికి అందునా ముఖ్యంగా ఆడపడుచులకి అదనంగా కలిగే దుర్గతి మరొకటి ఉందని అదే పారతంత్ర్యం అని చెప్పే తీరు గంభీరంగా సున్నితంగా ఆమె కవిత్వీకరించారు.ఇక కుప్పాంబిక ధీరత్వం, శూరత్వం కలగలిసిన నాయిక, ఆమె ఒక వీరునికి కూతురుగా, మరో వీరునికి పత్నిగా వర్ధిల్లడమే కాక అందమైన, అద్భుతమైన పద్య నైవేద్యాన్ని సాహితీ ప్రియులకు అందించిన మహిళాసాహితీ మణిదీపం. తండ్రి గోన బుద్ధా రెడ్డి నుంచి కుప్పాంబిక సాహిత్య వారసత్వాన్ని పొందారు. భర్త మల్యాల గుండనాథుని ఆస్థానంలోని కవులు, ఈశ్వరభట్టోపాధ్యుడు అనే ఉద్దండ పండితుడు వంటివారి స్ఫూర్తితో సాహిత్యానికి మెరుగులు దిద్దుకున్నారని ప్రతీతి. కుప్పాంబిక తొలి తెలుగు కవయిత్రిగా గుర్తింపు పొందింది. పదహారవ శతాబ్దం నాటి మొల్లకు రెండు వందల ఏండ్ల ముందే కవిత్వం రాసిన కుప్పాంబికనే తొలి తెలుగు కవయిత్రిగా సాహిత్యకారుడు, చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ నిర్ధారించడం గొప్ప ఆధారం. అయితే కుప్పాంబిక రచనలుగానీ, వాటి పేర్లు కానీ ఇప్పటివరకూ లభ్యం కాలేదు. అయినా శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు తన సంకలన గ్రంథంలో కుప్పాంబిక పద్యాన్ని ఒకదానిని ఉదహరించాడు. ఇదొక్కటే ప్రస్తుతానికి మనకు తెలిసింది. నేర్పుగల కవి రాసిన పద్యం కన్నా తక్కువేం కాదు ఈ పద్యం. ఇది ఒక కావ్యంలోని నాయికా విరహతాపాన్ని వర్ణించే పద్యం. బాల్యం నుంచి యవ్వనదశకు చేరుకున్న తనపై మన్మథుడు కురిపించే బాణాలు పెంచే మోహాన్ని తన ప్రియసఖులతో కూడా చెప్పుకోలేకపోవడం గురించి ఆ పద్యంలో కుప్పాంబిక హృద్యంగా రాశారు. ఇంతటి రమ్యమైన పద్యాన్ని 13వ శతాబ్ది కాలంలోనే ఒక మహిళ అందించడం అందులోనూ పైకి చెప్పలేని భావజాలాన్ని తన మనఃస్థితిని మధురమైన పదాల కూర్పుతో అల్లడం ఆమె రచనా వైశిష్ట్యానికి తార్కాణం.తొలి తెలుగు తెలంగాణ కవయిత్రి కుప్పాంబిక. కుప్పాంబిక తెలంగాణ సాహిత్య జగత్తు అంతా గర్వించదగిన పాలమూరు ఆడబిడ్డ. తెలంగాణ ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసి, మహిళా సాహిత్యక్షేత్రంలో తొలి బీజాలు వేసిన కాకతీయుల కాలం నాటి కవయిత్రి. కాకతి రుద్రమదేవి కాలానికి చెందిన కుప్పాంబిక సాహిత్య కృషిలో 'సుభద్రా కల్యాణము' అనే ద్విపద కావ్యాన్ని రచించినట్లు తెలుస్తోంది, కానీ ఆమె రచనలు పూర్తిగా లభ్యం కాలేదు. అయ్యలరాజు తన సంకలనంలో ఉదహరించిన పద్యాలను, భూత్పూర్ శాసనాన్ని (క్రీ.శ. 1276) ఆధారంగా చేసుకుని ఈమె గొప్ప కవయిత్రిగా చరిత్రకారులు గుర్తించారు. ఆధ్యాత్మికతలో గొప్ప భక్తి పారాయణురాలైన కుప్పాంబిక లక్ష్మీనారాయణ, అనంత అరుంధతీయ, జలశయన, ద్వాదశి వ్రతాలు నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.ఆమె గుణశీలముల పరిశీలిస్తే సకల గుణగణములకు ఆలవాలమైన వనితగా, అనుకూలవతిగా కుప్పాంబిక కీర్తిగాంచారు.తొలి తెలుగు తెలంగాణ కవయిత్రి కుప్పాంబిక. కుప్పాంబిక తెలంగాణ సాహిత్య జగత్తు అంతా గర్వించదగిన పాలమూరు ఆడబిడ్డ. తెలంగాణ ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసి, మహిళా సాహిత్యక్షేత్రంలో తొలి బీజాలు వేసిన కాకతీయుల కాలం నాటి కవయిత్రి.కాకతీయ రుద్రమదేవి కాలానికి చెందిన కుప్పాంబిక సాహిత్య కృషిలో 'సుభద్రా కల్యాణము' అనే ద్విపద కావ్యాన్ని రచించినట్లు తెలుస్తోంది, కానీ ఆమె రచనలు పూర్తిగా లభ్యం కాలేదు. అయ్యలరాజు తన సంకలనంలో ఉదహరించిన పద్యాలను, భూత్పూర్ శాసనం క్రీ.శ. 1276నాటిది ఆధారంగా చేసుకుని ఈమె గొప్ప కవయిత్రిగా చరిత్రకారులు గుర్తించారు.ఆధ్యాత్మికతలో గొప్ప భక్తి పారాయణురాలైన కుప్పాంబిక లక్ష్మీనారాయణ, అనంత అరుంధతీయ, జలశయన, ద్వాదశి వ్రతాలు నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆమె గుణశీలముల పరిశీలిస్తే సకల గుణగణములకు ఆలవాలమైన వనితగా, అనుకూలవతిగా కుప్పాంబిక కీర్తిగాంచారు. అలా కుప్పాంబిక కుటుంబ బాధ్యతలలో, ప్రజాపాలనలో, సాహిత్యం రచనలో తనదైన ముద్రను వేసి భావి తరాలకు నాటినుండీ సాహిత్య చిరునామాగా నిలిచారు.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు,**
**98493 05871**

## భద్రాద్రి పుణ్యక్షేత్రం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

- సందర్శించిన ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు
- ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



**భద్రాచలం మహా :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులను స్థానిక ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు పరిశీలించారు.రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపం, చిత్రకూట మండపం, అమ్మవారి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం తదితర ప్రాంతాలను సందర్శించి, వాటి ప్రత్యేకతలను దేవస్థానం ఈవో దామోదర్ రావుతో కలిసి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం భక్త రామదాసు కాలం నుంచి విశిష్టతను సంతరించుకుందని తెలిపారు. దాదాపు 400 సంవత్సరాల తర్వాత తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహకారంతో ఆలయం ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తారని, వచ్చే ఏడాది పుష్కరాల సందర్భంగా సుమారు కోటి మంది భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి సమయంలో ఆలయ అభివృద్ధి పనులు శ్రద్ధగా, వేగంగా కొనసాగడం ఎంతో సంతోషకరమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సాక్షిగా ఉండటం తన పూర్వజన్మ సుకృతమని వ్యాఖ్యానించారు.ఈ పర్యటనలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఏఈఓ శ్రావణ్ కుమార్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డి, సాయిబాబా, ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్, అమరవాది విజయరాఘవన్, మురళి, సీసీ అనిల్, ఎండి నవాబ్, ఎమ్మెల్యే పర్సనల్ పీఆర్ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి తన వివాహ వేడుకకు ఆహ్వానించిన సర్పంచ్ కిషోర్



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, సారపాక మేజర్ గ్రామ పంచాయతీ, సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, వివాహ వేడుక డా: శ్రావణి ప్రియ తో మే 1వ తేదీన న్యూ పాల్వంచ, సుగుణ గార్డెన్స్ నందు పెద్దలు ఇరు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా తన వివాహ వేడుకకు హాజరుకావాలని పంచాయతీ రాజ్ & గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, మహిళ & శిశు సంక్షేమ శాఖ మంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ములుగు జిల్లా, మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ను ములుగు జిల్లా పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తన వివాహ వేడుకకు తప్పనిసరిగా రావాలని వివాహ వేడుక శుభలేఖను మంత్రి సీతక్కకు అందజేసిన సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, కిషోర్ శివరాం నాయక్ తో వారి శ్రేయోభిలాషులు, పోట్రు ఏసుబాబు, దుగ్గెంపూడి శేషి రెడ్డి, పాల్గొన్నారు

## సీతారామచంద్రస్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్



**భద్రాచలం మహా :** పుణ్యక్షేత్రమైన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామివారిని ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టత, చరిత్ర గురించి వివరించారు.స్వామివారి ఆశీస్సులు పొందిన సునీల్ దత్ ఆలయ అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## 8 ఎకరాల్లో రూ.6 లక్షల పంట నష్టం

**కారేపల్లి, మహా :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం, గుంపెళ్ళగూడెం గ్రామాల సరిహద్దులలో ఆదివారం పంట చేలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు రైతులకు సంబంధించి ఎనిమిది ఎకరాల మొక్కజొన్న పంట కాలిపోయింది. మొక్కజొన్న పంటకు నిప్పు పట్టుకోవడంతో గమనించిన చుట్టుపక్కల రైతులు ఫైర్ స్టేషన్ కి ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. రైతులు మొక్కజొన్న పంట కోసి కుప్పలుగా పెట్టారు. కొందరు రైతులు కోయడానికి సిద్ధంగా ఉండగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కుమ్మరి పాపారావు, గుగులోత్ వీరన్న, ఎన్. ఉపేందర్ లకు చెందిన 8 ఎకరాల పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు రూ.6 లక్షల మేరకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రముఖ వ్యాపారి గణేష్ మృతి



**కారేపల్లి, మహా :** కారేపల్లి కి చెందిన ప్రముఖ వ్యాపారి భవనాశి గణేష్(గణపతి) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్ ఖమ్మంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. కారేపల్లి మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు పనిచేసిన గణేష్ కారేపల్లి లో హోటల్, వైన్ షాపు, ఎయిర్ టెల్ డిస్ట్రిబ్యూటర్ వంటి వ్యాపారాలు నిర్వహించారు. గణేష్ కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గణేష్ మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, నాయకులు అజ్మీర వీరన్న, పుట్ట నాగేశ్వర రావు, పిల్లి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ నాయకులు ఎర్ర నరసింహారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, మొరిశెట్టి కిరణ్, ఓరుగంటి రంగ తదితరులు ఉన్నారు.

### మాజీ ఎమ్మెల్యే అమరజీవి ముర్ల యర్రయ్య రెడ్డి
## 28వ వర్ధంతి సందర్భంగా అన్నదానం
**భద్రాచలం మనవసేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు**





**భద్రాచలం మహా :** భద్రాచలం మాజీ శాసనసభ్యులు అమరజీవి ముర్ల యర్రయ్య రెడ్డి గారి 28వ వర్ధంతి సందర్భంగా భద్రాచలం మనవసేవ ఆర్గనైజేషన్ మరియు వృద్ధుల ఆశ్రమంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించి, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ మాట్లాడుతూ, ముర్ల యర్రయ్య రెడ్డి గారు ఉమ్మడి భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, ఆదివాసీల హక్కులు మరియు చట్టాల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు.నిస్వార్థంగా, నిరాడంబరంగా జీవితాన్ని గడిపిన మహనీయుడిగా ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వారి ఆశయ సాధన కోసం కృషి చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో గర్నెపల్లి అశోక్, గుంటి రాజేష్, సొంది రవికుమార్, ముదిగొండ సత్యనారాయణ, ఎల్లంకి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వాసవి మాత జయంతి ఉత్సవాలు..

- ప్రతి ఇల్లూ సుఖసంతోషాలతో విరాజిల్లాలి..
- రూ.100 కోట్లతో ఆలయాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం..
- నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి..





**నల్గొండ, మహా :** రాష్ట్రంలోని ప్రతి కుటుంబం వాసవి మాత ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నల్గొండ పట్టణంలోని బీట్ మార్కెట్ లోని రామకోటి స్థూప దేవాలయం, గాంధీ పార్క్‌లో ఘనంగా నిర్వహించిన వాసవి మాత జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**అధికారికంగా ఉత్సవాల నిర్వహణ గర్వకారణం..**

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటూ.. రామకోటి దేవాలయానికి ధ్వజ స్తంభం, మార్కెట్ యార్డ్ స్థలంతో పాటు దేవాలయ అభివృద్ధికి అదనంగా 120 గజాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. గుడి ఎదుట పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తానన్న మాటను నిలబెట్టుకున్నానని ఆయన వివరించారు. బాసర, కాళేశ్వరం దేవాలయాలు, గోదావరి పుష్కరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 500 కోట్లు కేటాయించింది. నల్గొండలోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, బ్రహ్మంగారి గుట్టలోని శివాలయ అభివృద్ధి పనులను రూ. 100 కోట్లతో రానున్న రెండు నెలల్లో పూర్తి చేస్తాం. అని మంత్రి స్పష్టం చేశారు.

**పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి..**

గాంధీ పార్క్‌లోని భవనాన్ని పునర్నిర్మించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, డీఎంహెచ్ఓ కార్యాలయం మారిన వెంటనే ఆ ప్రాంతానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రకాశం బజార్ వ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది నాటికి రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించేలా పనులు వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగొని రమేష్, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, వంగూరు లక్ష్మయ్య, కార్పొరేటర్లు కవిత, పెరిక స్వాతి, ఆర్యవైశ్య సంఘం నేతలు నాంపల్లి భాగ్య, నరసింహ, యమ మురళి, దైవాదినం తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి (నాభి శిల) ప్రతిష్ఠాపనలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పల్లెచెరువులో బొడ్రాయి (నాభి శిల) ప్రతిష్ఠ కార్యక్రమంలో బిజెపి రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుణ్ణి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యంజాల సత్తయ్య, గోషామహల్ కృష్ణ, యాంజల సురేష్, గడ్డం కృపాకర్, సునీల్, చంద్ర, చరణ్, యాంజల చిన్న, రమేష్ రెడ్డి, అమర్ రెడ్డి పాల్గొన్నారు.

## మొండిగౌరెల్లిలో అక్రమంగా ప్రభుత్వ ఆస్థిని కొల్లాగోడుతున్నారు?
**తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మొండి గౌరెల్లి గ్రామంలో భూసేకరణ పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం ఉందని, గోడుకొండ్ల ప్రవీణ్ ఆరోపించారు. రైతు భూమి సర్వే పూర్తి కాగానే రైతుకు ఎంత భూమి ఉంది, రికార్డు కబ్జా ఎంత ఉంది, ఈ వివరాలు రైతుకు చెప్పకపోవడం వెనక ఉన్న రహస్యం ఏంటని తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలంలోని మొండి గౌరెల్లి గ్రామంలో పారిశ్రామిక పార్క్ పేరుతో ప్రభుత్వ భూములు సర్వే నెంబర్లు 19,68,127లలో మొత్తం విస్తీర్ణం 677 29 ఎకరాలు ప్రభుత్వ భూమి సేకరణకు గత సంవత్సరంలో నోటిఫికేషన్ ప్రభుత్వం ప్రకటించింది. కొంతమంది భూకబ్జాదారులు ప్రభుత్వ అధికారులతో చేతులు కలిపి విచ్చలవిడిగా దారుణాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ ఆరోపించారు గ్రామం లో ఉన్న సోమన్న గుడి దగ్గర ఉన్న గుండం మినహాయించి మిగితా గుట్టలు. బండలు మొత్తం అధికారులకు కబ్జా చూపించి ఫోటో దిగిన లీడర్ ఇలాంటి అక్రమాలు జరుగుతున్న రెవిన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం దేనికి సంకేతమని, రాజకీయ పలుకుబడితో గుట్టలను కూడా వదలని కొంతమంది లీడర్లు, గతంలో గుట్టలకు రైతుబంధు తీసుకొని లక్షలు సంపాదన, ఇప్పుడు భూసేకరణ పేరుతో కోట్ల దందా భూసేకరణ పేరుతో ఒక్కప్రక్క రైతులకు నష్టం జరుగుతుంటే మరో ప్రక్కన లీడర్లకు కోట్ల దందా నడుస్తుందని ఇందులో ఎవరి వాటా ఎంత భూమి కబ్జా పేరుతో విచ్చలవిడిగా నాయకులు అధికారులు మధ్య భారీగా ముడుపులు అందుతున్నాయని, గుట్టలను బండలను కబ్జా పేరుతో వదలకుండా అక్రమంగా ప్రభుత్వ ఆస్థిని కొల్లాగోడుతున్నారు.

## ఐటీకి 'నామం'.. ఖజానాకు కన్నం!

### పన్ను ఎగవేతకు పంగ 'నామాలు'..

- నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పన్ను ఎగవేత పర్వం ఉపాధ్యాయులే అధిక శాతం?
- మామూళ్ళ మత్తులో కళ్ళు మూసుకున్న ట్రెజరి శాఖ అధికారులు..
- డీఏలు, సెలవు నగదుపై గోప్యత.. ఎస్టీఓ కనుసన్నల్లోనే దందా?
- నాలుగు మండలాల పరిధిలో వెయ్యి మంది ఉపాధ్యాయుల చేతివాటం?






**నల్గొండ, మహా :** ప్రభుత్వ నిబంధనలను గౌరవించి పన్ను చెల్లించాల్సిన వారే నిలువునా వంచించారు. సమాజానికి విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే ఆదాయపు పన్ను (Income Tax) ఎగవేతకు అడ్డదారులు తొక్కారు. వీరి అక్రమాలను నిలువరించాల్సిన డ్రాయింగ్ అధికారులు నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన ట్రెజరీ అధికారులు తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నల్గొండ జిల్లాలోని నల్గొండ, తిప్పర్తి, నార్కెట్‌పల్లి, చిట్యాల మండలాల పరిధిలో వెలుగు చూసిన ఈ ఉదంతం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో కలకలం రేపుతోంది.

**అక్రమాలకు అడ్డాగా ట్రెజరీ కార్యాలయం!**

నల్గొండ ట్రెజరీ కార్యాలయంలో అక్రమాలు అడ్డు అదుపులేకుండా సాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారి (STO) అండదండలతోనే ఈ ఐటీ ఎగవేత పర్వం సాగుతున్నట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నార్కెట్‌పల్లి, అక్కెనపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల డ్రాయింగ్ ఆఫీసర్లు సమర్పించిన బిల్లుల్లో భారీ తేడాలున్నట్లు తెలుస్తోంది. నార్కెట్‌పల్లి డీడీఓ ఒకరకంగా, అక్కెనపల్లి డీడీఓ మరో రకంగా బిల్లులు పాస్ చేయించుకోవడం గమనార్హం. ఈ తప్పుడు లెక్కలను ఆమోదించేందుకు సదరు ఖజానా అధికారి భారీగా మామూళ్లు ముట్టజెప్పినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులే మరో అధికారికి లంచం ఇచ్చి ప్రభుత్వ ఆదాయానికే గండి కొట్టడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది.

**డీఏ మాయాజాలం.. లెక్కల్లో గోల్‌మాల్..**

202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండు పర్యాయాలు కరువు భత్యం (DA) మంజూరు చేసింది. ఐటీ కొత్త నిబంధనల ప్రకారం రూ. 12,00,000 వరకు పన్ను మినహాయింపు ఉండటం, రూ. 75,000 స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే రూ. 12,75,000 ఆదాయం దాటిన వారు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పన్ను పరిధిలోకి రాకుండా ఉండేందుకు కొందరు ఉపాధ్యాయులు తెలివిగా ఒక డీఏ మొత్తాన్ని, అలాగే 'సరెండర్ లీవ్' (సెలవు నగదు) ద్వారా వచ్చిన భారీ మొత్తాలను ఫారం 16లో పొందుపరచకుండా దాచిపెట్టారని ఉద్యోగం వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**లోపాయకారి ఒప్పందం ఇదేనా?**

ఒకే పాఠశాలలో పనిచేస్తున్న వారిలో కొందరు రెండు డీఏలు చూపిస్తుంటే, మరికొందరు ఒకటే చూపించడం అధికారుల ధృవీకరణ లోపాన్ని ఎత్తిచూపుతోంది. ప్రతి ఉద్యోగి నుంచి రూ. 1,500 నుంచి రూ. 3,000 వరకు వసూలు చేసి, ఆ మొత్తాన్ని ట్రెజరీలోని కీలక అధికారులకు 'మామూళ్ల' రూపంలో సమర్పించి ఈ అక్రమ పని పూర్తి చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరిగిన చెల్లింపుల రికార్డులు స్పష్టంగా ఉన్నప్పటికీ, ట్రెజరీ అధికారులు ఆడిట్ చేయకుండానే కళ్లు మూసుకుని బిల్లులు ఆమోదించారని సమాచారం.

**సమగ్ర విచారణ జరిగేనా?**

నాలుగు మండలాల పరిధిలో సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగులు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పక్కదారి పట్టించారు. జిల్లా యంత్రాంగం స్పందించి ఆన్‌లైన్ పేమెంట్ డేటాను సేకరించి, దాన్ని ఫారం 16లతో సరిపోల్చితే అసలు బండారం బయటపడుతుందని నిజాయితీగా పన్ను చెల్లించే ఉద్యోగులు కోరుతున్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న సూత్రధారులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటారా? భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందా?

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం మేట్లగూడెంలో జరిగిన వివాహ వేడుకకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ హాజరయ్యారు. మోట్లగూడెంకు చెందిన తేజశ్రీ నాగలక్ష్మి శ్రీనివాస్ ల వివాహ వేడుక ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా హాజరైన ఎమ్మెల్యే వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొడుగు పెంటయ్య, మాలోత్ బావుసింగ్, భూక్య బాలు, ఉప సర్పంచ్ తాటి రామారావు,డిసిసి ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గుండ్ల జగన్నాథం, వైరా అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్, దూడ అర్జున్, కనకం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో ఘనంగా హిందూ సమ్మేళన
## పోస్టర్ ఆవిష్కరణ – ఏర్పాట్లు వేగవంతం



**భద్రాచలం, మహా :** భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం నిర్వహించనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు భద్రాచలం పట్టణంలోని కాకతీయ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ముఖ్య సమన్వయ సమావేశం విజయవంతంగా ముగిసింది. సమావేశంలో భాగంగా సమ్మేళనానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ప్రముఖుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా *హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరియు కార్యక్రమ నిర్వాహకులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, హిందూ ధర్మ రక్షణ మరియు సమాజ ఐక్యతను బలోపేతం చేయడమే ఈ మహా సమ్మేళన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే పలు సమావేశాల ద్వారా ఏర్పాట్లను సమీక్షించామని, పోస్టర్ విడుదలతో ప్రచార కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తున్నామని పేర్కొన్నారు. సమ్మేళనాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ కృష్ణ చైతన్య శివ నాగస్వామి , కుంజా ధర్మ నాగభూషణ శాస్త్రి , గోపి , ఎం.వి. సుబ్రహ్మణ్యం మరియు శ్రీధర్ జీ పాల్గొన్నారు. వీరితో పాటు హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు మరియు ఇతర ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమ్మేళన విజయానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

### ఇల్లందులో జరగనున్న ఏఐయుకేఎస్ ఆల్ ఇండియా
## ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలి
**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు**



**చర్ల మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఆర కొత్తగూడెం గ్రామంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఏఐయుకేఎస్ (అఖిల భారత ఐక్య రైతు సంఘం) ఆల్ ఇండియా ప్రథమ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. మే 11, 12, 13 తేదీల్లో ఇల్లందు పట్టణంలో జరగనున్న ఈ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా భద్రాచలం డివిజన్ నాయకులు సాయన్న, చర్ల మండల పార్టీ కార్యదర్శి పాలెం సుక్కయ్య మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. ఆ విధానాలను ఎదుర్కొనేందుకు సకల జనులను ఐక్యం చేయడానికే ఉద్యమాల గడ్డ అయిన ఇల్లందులో ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు పండిస్తున్న అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంట బీమా అమలు చేయాలని, రైతు పంటలకు ఖచ్చితమైన ధర నిర్ణయించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు, రైతు సంఘాలు, రైతు కూలీలు, పార్టీ శ్రేణులు, పార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చింతకాయల సరళ, పాలెం నాగరాజు, కల్లూరి కృష్ణ, సిమిడి సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## భద్రాచలంలో దొంగల ముఠా అరెస్ట్ – రెండు వాహనాలు, బైక్ స్వాధీనం



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిన్న రాత్రి కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వారు భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించిన టౌన్ పోలీసులను భద్రాచలం టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగరాజు అభినందించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అనుమానితుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.



## కలెక్టరేట్ లో వాసవి మాత జయంతి

**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైశాఖ శుక్ల పక్ష దశమి ఆదివారం నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , మరియు జిల్లా యువజన మరియు క్రీడాల అధికారి ధనంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారుస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు జ్యోతి ప్రజ్వలన గావించి,పూల మాలతో అమ్మ వారికీ అలంకరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాలఅభ్యర్థన మేరకు, వాసవీ మాత జయంతిని (వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి) రాష్ట్ర పండుగగా గుర్తించి. ఈ నిర్ణయంతో 26 ఏప్రిల్ 2026న,తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, ఆర్యవైశ్య సత్రాలలో ప్రభుత్వ లాంఛనాలతో వేడుకలు జరుగుతుందని తెలిపారు జిల్లా యువజన మరియు క్రీడాల అధికారి ధనంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా 'వైశాఖ శుక్ల పక్ష దశమి' రోజున వాసవీ మాత జయంతి అని దీనిలో భాగంగా ఈ సంవత్సరం వాసవీ మాత పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తునామని వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి సంఘం అధ్యక్షులు మహేష్,జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ,వాసవి సంఘం రీజినల్ సెక్రటరీ రమేష్ ,వాసవి సంఘం సెక్రటరీ హనుమంతరావు , వాసవి మెంబర్లు, కార్యాలయ సిబ్బంది మురళి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో మెగా జాబ్ మేళా

- 3500 ఉద్యోగాలు
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే జాబ్ మేళా విషయం వెల్లడించారు సామాజిక బాధ్యతగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మే 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తామని భువనగిరి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ మెగా జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయి. సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొని 3500కి పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.అర్హతలు: 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఇంజనీరింగ్ ఇతర టెక్నికల్ అర్హతలు జీతం: ₹ 12,000 నుండి ₹ 40,000 వరకు (అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా)యువత స్వయం ఆధారితంగా ఎదగాలంటే ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవడం అవసరమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా వేలాది మంది యువతకు నేరుగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.అభ్యర్థులు తమ రిజ్యూమ్, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని సూచించారు. ముందస్తు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. భువనగిరి నియోజకవర్గాన్ని ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయడం, నిరుద్యోగ యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్, మున్సిపల్ చైర్మన్, సీనియర్ నాయకులు, మండల మరియు గ్రామాల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జనాభా లెక్కల స్వీయ గణన–2027 కార్యక్రమంలో పాల్గొన్న

# ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జనాభా లెక్కల స్వీయ గణన-2027 కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్టలోని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాసానికి చేరుకున్న జేసీ భాస్కర్ రావు, ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యుల వివరాలను జనాభా లెక్కల స్వీయ గణన ప్రక్రియలో నమోదు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా వ్యక్తిగత వివరాలు, కుటుంబ నిర్మాణం, విద్య, ఉపాధి తదితర అంశాలను సమగ్రంగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు...స్వీయ గణన-2027లో నమోదు చేసిన వివరాలకు సంబంధించిన ధృవీకరణ ప్రతులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఈ స్వీయ గణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సరైన వివరాలను నమోదు చేయాలని సూచించారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, నేటి నుండి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా జనాభా లెక్కల స్వీయ గణన కార్యక్రమం ప్రారంభమైంది.గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతి ఇంటికీ ఈ ప్రక్రియ చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు వెల్లడించారు.ప్రజలు ఆన్‌లైన్ లేదా ప్రత్యక్షంగా అందుబాటులో ఉన్న సదుపాయాల ద్వారా తమ కుటుంబ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు మరింత సమర్థవంతంగా రూపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే ప్రజావాణి

- రాష్ట్రస్థాయి నుంచి రెవెన్యూ డివిజన్ల వరకు సేవలు విస్తరణ
- అర్జీల పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం
- జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని అధికారులకు సీఎం హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో పౌర సమస్యల పరిష్కారమే పరమావధిగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. సచివాలయానికి లేదా ప్రజా భవన్‌కు వేల సంఖ్యలో తరలివస్తున్న ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను క్షేత్రస్థాయికి విస్తరించాలని అధికారులను ఆదేశించారు. పాలన అనేది కేవలం రాజధానికే పరిమితం కాకుండా, మారుమూల గ్రామంలోని సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు సమగ్రమైన కార్యాచరణను సిద్ధం చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.

**రెవెన్యూ డివిజన్ స్థాయికి వికేంద్రీకరణ**

ప్రస్తుతం జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాలను మరింత చేరువ చేస్తూ, రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా వీటిని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనివల్ల ప్రజలు వందల కిలోమీటర్ల ప్రయాణం చేసి జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం తప్పుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి సోమవారం డివిజన్ కేంద్రాల్లో ఆర్డీఓల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, అన్ని శాఖల అధికారులు అక్కడ అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని సూచించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమయ్యేలా చూడటం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

**అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారం**

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తర్వాత దాని పరిస్థితి ఏమిటో తెలియక అర్జీదారులు పడుతున్న ఆందోళనను ముఖ్యమంత్రి గుర్తించారు. అందుకే, ఇకపై ప్రతి అర్జీ పురోగతిని ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారుడికి తెలియజేసేలా పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు స్వీకరించిన క్షణం నుంచి అది ఏ అధికారి దగ్గర ఉంది, పరిష్కారానికి ఎంత సమయం పడుతుంది అనే వివరాలను అర్జీదారుడి మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

**అధికారుల జవాబుదారీతనంపై సీఎం నొక్కి**

కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారంలో నాణ్యత ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. ఫిర్యాదులను నామమాత్రంగా పరిష్కరించడం లేదా సాంకేతిక కారణాలు చూపి తిరస్కరించడం వంటి చర్యలను సహించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. ప్రతి ఫిర్యాదును మానవీయ కోణంలో పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని, ఉన్నతాధికారులు ప్రతి నెలా క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

**హైదరాబాద్‌కు వ్యయప్రయాసలు తప్పనున్నాయి**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు తమ సమస్యల కోసం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌కు తరలివస్తున్నారు. దీనివల్ల వారికి సమయం వృథా అవ్వడమే కాకుండా ఆర్థిక భారంతో కూడిన వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో, ప్రజలు తమ సొంత డివిజన్ కేంద్రాల్లోనే తమ బాధలను చెప్పుకునే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు మరియు నిరుపేదలకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులకు అధికారాలను దత్తత చేయడం ద్వారా సమస్యల పరిష్కార వేగం పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్ బలోపేతం**

ప్రజావాణి సేవలను మరింత శాస్త్రీయంగా నిర్వహించేందుకు అత్యాధునిక సాంకేతికతను జోడించాలని సీఎం ఆదేశించారు. ప్రతి రెవెన్యూ డివిజన్ నుంచి అందే అర్జీలను ఒకే కేంద్రీకృత పోర్టల్‌లో నమోదు చేయాలని, దీనివల్ల రాష్ట్రస్థాయిలో వాటిని పర్యవేక్షించడం సులభమవుతుందని తెలిపారు. ఒకే సమస్యపై పదేపదే అర్జీలు వస్తున్నాయంటే అక్కడ క్షేత్రస్థాయిలో లోపం ఉన్నట్లు గుర్తించి, సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా జాప్యాన్ని నివారించడమే కాకుండా, అధికారుల్లో జవాబుదారీతనం పెంచవచ్చని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు.

**ప్రజా ప్రభుత్వం - ప్రజాహిత నిర్ణయం**

తెలంగాణలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం అంటే కేవలం ఓట్లు వేయించుకోవడం మాత్రమే కాదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి నాయకులు అందుబాటులో లేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితిని పూర్తిగా మార్చివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి విస్తరణ ద్వారా సామాన్యుడి గొంతు ప్రభుత్వానికి నేరుగా చేరుతుందని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే వరకు ప్రభుత్వం విశ్రమించదని ఆయన హామీ ఇచ్చారు. ఈ వికేంద్రీకరణ ప్రక్రియను తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# జల కష్టాలకు పొదుపే మార్గం

- వినియోగంలో 20 శాతం కోత విధించుకోవాలి
- రూ. 720 కోట్లతో పైపులైన్ల ఆధునీకరణ
- వచ్చే ఏడాది ఆఖరు నాటికి గోదావరి జలాలు
- డిమాండ్‌కు తగ్గ సరఫరా కష్టమే
- ఎండీ అశోక్ రెడ్డి విజ్ఞప్తి




**హైదరాబాద్, మహా:** భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో తాగునీటి అవసరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుతం నగర జనాభా కోటి 30 లక్షలకు చేరగా, రోజువారీ నీటి డిమాండ్ గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ప్రస్తుత పరిస్థితులపై స్పష్టమైన ప్రకటన చేశారు. ప్రజలు కోరుతున్న విధంగా అదనంగా 100 శాతం నీటిని సరఫరా చేయడం ప్రస్తుత మౌలిక సదుపాయాలతో జలమండలికి సాధ్యపడదని ఆయన తేల్చిచెప్పారు. నగరం చుట్టుపక్కల ఉన్న వనరుల నుంచి గరిష్ట స్థాయిలో నీటిని సేకరిస్తున్నప్పటికీ, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయడం సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు.

### 20 శాతం పొదుపు మంత్రమే శరణ్యం

వేసవి తాపం పెరుగుతున్న వేళ ప్రతి నీటి బొట్టును అమూల్యంగా భావించాలని జలమండలి సూచిస్తోంది. ప్రజలు తమ దైనందిన జీవితంలో వినియోగించే నీటిలో కనీసం 20 శాతాన్ని పొదుపు చేయగలిగితే, ఆ మిగిలిన నీటిని ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంటుందని ఎండీ వివరించారు. ముఖ్యంగా తోటలకు నీళ్లు పెట్టడం, వాహనాలు కడగడం వంటి పనులకు తాగునీటిని వాడకూడదని ఆయన కోరారు. ప్రజల సహకారం లేనిదే ఈ నీటి సంక్షోభాన్ని అధిగమించడం సాధ్యం కాదని, స్వచ్ఛందంగా నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### నల్లకుంట అనుభవంతో అప్రమత్తం

తాగునీటి వృథాపై ఎండీ అశోక్ రెడ్డి ఒక ఆసక్తికరమైన ఉదాహరణను ప్రస్తావించారు. ఇటీవల నల్లకుంట ప్రాంతంలో పర్యటించినప్పుడు, సరఫరా సమయాన్ని కేవలం పది నిమిషాలు పెంచితే నీళ్లన్నీ రోడ్లపాలవుతున్నాయని, అదే పది నిమిషాలు తగ్గిస్తే ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని ఈ ఘటన నిరూపిస్తోంది. ప్రతి ఇంట్లో నల్లా లీకేజీలు లేకుండా చూసుకోవడం, స్నానం మరియు బ్రష్ చేసే సమయంలో నీటిని వృథా చేయకుండా ఉండటం వంటి చిన్నపాటి జాగ్రత్తలు పెద్ద మార్పును తెస్తాయని ఆయన సూచించారు.

### గోదావరి జలాల కోసం ముమ్మర యత్నాలు

నగర నీటి అవసరాలను శాశ్వతంగా తీర్చేందుకు ప్రభుత్వం గోదావరి ఫేజ్ 2 మరియు 3 పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టింది. ఈ ప్రాజెక్టులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయి. ఇప్పటికే నాలుగు కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్ పనులు పూర్తయ్యాయని, ఈ పనులు అనుకున్న సమయానికి ముగిస్తే నగరానికి నీటి కష్టాలు తప్పుతాయని జలమండలి ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అప్పటి వరకు ఉన్న వనరులను పొదుపుగా వాడుకోవడమే ఏకైక మార్గమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### శిథిల పైపులైన్ల స్థానంలో కొత్త వ్యవస్థ

నగరంలో నీటి సరఫరా వ్యవస్థకు ప్రధాన ఆటంకంగా మారిన మంజీరా పైపులైన్ల ఆధునీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దశాబ్దాల క్రితం వేసిన ఈ పైపులైన్లు బలహీనపడటంతో తరచూ లీకేజీలు ఏర్పడి భారీగా నీరు వృథా అవుతోంది. వీటి స్థానంలో కొత్త పైపులైన్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 720 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మంజీరా నుంచి అనుకున్న మేర నీటిని సేకరించలేకపోవడానికి ఈ పైపులైన్ల దౌర్బల్యమే కారణమని, కొత్త వ్యవస్థ అందుబాటులోకి వస్తే మరో 15 ఎంజీడీల అదనపు నీరు నగరానికి చేరుతుందని అశోక్ రెడ్డి వెల్లడించారు.

### ఉస్మాన్ సాగర్ నుంచి అదనపు సరఫరా

చారిత్రాత్మక జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ల నుంచి కూడా నీటి సేకరణను పెంచాలని జలమండలి నిర్ణయించింది. ఉస్మాన్ సాగర్ నుంచి అదనంగా 25 ఎంజీడీల నీటిని తరలించేందుకు కొత్త పైపులైన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులను త్వరలోనే ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయనున్నారు. ఐదు ప్రధాన వనరుల ద్వారా ప్రస్తుతం నిత్యం 600 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నామని, ఉస్మాన్ సాగర్ అదనపు జలాలు అందుబాటులోకి వస్తే కొంత ఊరట లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### సింగూరులో అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు

సింగూరు డ్యామ్ మరమ్మతుల కారణంగా ప్రస్తుతం అక్కడ కేవలం 8 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇది ఆందోళన కలిగించే విషయమే అయినప్పటికీ, అవసరమైతే అత్యవసర పంపింగ్ పద్ధతి ద్వారా నీటిని సేకరించి నగరానికి తరలించేందుకు జలమండలి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా సాంకేతిక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, నీటి లీకేజీలను అరికట్టేందుకు తనిఖీలను ముమ్మరం చేశామని ఎండీ తెలిపారు.

### సమష్టి కృషితోనే జల భద్రత

హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న తరుణంలో నీటి భద్రత అనేది కేవలం ప్రభుత్వం లేదా జలమండలి బాధ్యత మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడి కర్తవ్యమని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. 2 వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 15 లక్షల నల్లా కనెక్షన్లకు నీటిని చేరవేయడంలో ఎన్నో వ్యయ ప్రయాసలు ఉంటాయని, వాటిని గుర్తించి ప్రజలు సహకరించాలని కోరారు.

# 2030 నాటికి మలేరియా రహిత భారతం

- సీసీఎంబీ వేదికగా శాస్త్రవేత్తల సమర శంఖం
- ప్రాణవాయువుకు భరోసా ఇచ్చేలా ఆధునిక వైద్య పరిశోధనలు
- ప్రభుత్వాలు, పరిశ్రమలు సమన్వయంతో సాగాలని నిపుణుల పిలుపు

**హైదరాబాద్, మహా:** భారతదేశాన్ని 2030 నాటికి మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాస్త్రవేత్తలు, ప్రభుత్వ యంత్రాంగం, పరిశ్రమలు ఒకే తాటిపైకి రావాలని నిపుణులు ఉద్ఘాటించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ హబ్సిగూడలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీసీఎంబీ ఒక ప్రతిష్ఠాత్మక సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా సీసీఎంబీ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ, మలేరియా నిర్మూలన అనేది కేవలం వైద్యులకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇందులో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మలేరియా మహమ్మారిని భూస్థాపితం చేయడానికి ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లపై ఈ సదస్సులో లోతైన మేథోమథనం జరిగింది.

### శాస్త్రీయ అవగాహనతోనే విజయం సాధ్యం

మలేరియా వ్యాప్తిని అడ్డుకోవడంలో శాస్త్రీయ అవగాహన అత్యంత కీలకమని సీసీఎంబీ డైరెక్టర్ డా.వినయ్ కుమార్ నందికూరి అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 'హై బర్డెన్ టూ హై ఇంపాక్ట్' జాబితా నుంచి భారత్ విజయవంతంగా బయటపడటం ఒక చారిత్రాత్మక విజయమని ఆయన కొనియాడారు. పరిశోధనల ఫలితాలు సామాన్యుడికి చేరినప్పుడే అంటువ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని, ఈ దిశగా సీసీఎంబీ తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తోందని ఆయన వివరించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే చిట్టచివరి వ్యక్తికి కూడా నాణ్యమైన వైద్యం అందించగలిగినప్పుడే మలేరియాపై యుద్ధంలో మనం పూర్తిస్థాయిలో విజయం సాధించగలమని ఆయన స్పష్టం చేశారు.

### వాతావరణ మార్పుల ముప్పు - దోమల స్వైరవిహారం

ప్రస్తుత కాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు మలేరియా వ్యాప్తికి ఊతమిస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూతాపం పెరగడం వల్ల దోమల సంతానోత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైన్సెస్ డీన్ ఆచార్య రఘుపతి అంచలా విశ్లేషించారు. గతంలో కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన ఈ వ్యాధి, ప్రస్తుతం పట్టణీకరణ మరియు వలసల కారణంగా నగరాలకు కూడా వేగంగా విస్తరిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ మలేరియా కేసులు నమోదు కాని ప్రాంతాల్లో కూడా ఇప్పుడు దోమల ప్రభావం కనిపిస్తోందని, ఇది ప్రజారోగ్య వ్యవస్థకు ఒక పెద్ద సవాలుగా పరిణమించిందని ఆయన వివరించారు.

### శరీరంలో పరాన్నజీవి మాయాజాలం

మలేరియా పరాన్నజీవి మానవ శరీరంలో ప్రవేశించిన తర్వాత చేసే విన్యాసాల గురించి సీసీఎంబీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పూరన్‌సింగ్ శాస్త్రీయ వివరణ ఇచ్చారు. ఆడ ఎనోఫిలిస్ దోమ కుట్టినప్పుడు స్పోరోజాయిట్స్ రూపంలో పరాన్నజీవి నేరుగా రక్తంలోకి ప్రవేశించి, అతి తక్కువ సమయంలోనే కాలేయానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. అక్కడ వేల సంఖ్యలో మెరోజోయిట్స్‌గా వృద్ధి చెందే వరకు రోగిలో ఎటువంటి బాహ్య లక్షణాలు కనిపించవని, ఇది అత్యంత ప్రమాదకరమైన దశ అని ఆయన పేర్కొన్నారు. కాలేయం నుంచి ఇవి రక్తంలోని ఎర్ర రక్త కణాల్లోకి ప్రవేశించినప్పుడే జ్వరం, వణుకు వంటి లక్షణాలు బయటపడతాయని, అందుకే ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం అవసరమని ఆయన సూచించారు.

### హిమాలయ మొక్కల నుంచి దివ్యౌషధం

మలేరియా నియంత్రణలో సరికొత్త ఆవిష్కరణలు ప్రాణం పోసుకుంటున్నాయి. హిమాలయ పర్వత శ్రేణుల్లో లభించే అరుదైన మొక్కల సారం ఆధారంగా 'ఒపుణికా' అనే హెర్బల్ మందును రూపొందించినట్లు కాన్సిటెల్ లైఫ్ సైన్సెస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్కె దాష్ వెల్లడించారు. ఈ ఔషధం మలేరియా పరాన్నజీవిని కాలేయం మరియు రక్తం రెండింటిలోనూ అడ్డుకోవడంలో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఐఐటీ మద్రాస్ మరియు గోవా బిట్స్ పిలానీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల సహకారంతో కాలేయంలోనే పరాన్నజీవిని తుదముట్టించే సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నామని, ఇది మలేరియా చికిత్సలో ఒక విప్లవాత్మక మార్పు కానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### టీకాల తయారీలో సవాళ్లు , అవకాశాలు

వైరస్ లేదా బ్యాక్టీరియాతో పోలిస్తే మలేరియా పరాన్నజీవి అత్యంత సంక్లిష్టమైన జీవక్రియను కలిగి ఉంటుందని భారత్ బయోటెక్ మెడికల్ డైరెక్టర్ డా.బద్రి నారాయణ్ పట్నాయక్ వివరించారు. వీటిని అడ్డుకునే శక్తివంతమైన యాంటీబాడీలను తయారు చేయడం శాస్త్రవేత్తలకు ఒక పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న రెండు ప్రధాన టీకాలలో ఒక దానిని భారత్ బయోటెక్ ఉత్పత్తి చేస్తోందని ఆయన గర్వంగా తెలిపారు.

# శుభకార్యం సంబరం.. బ్లౌజ్ తెచ్చిన తంటా

- బ్లౌజ్ ముక్కను పాడు చేస్తే లక్ష రూపాయల పరిహారం
- నిర్లక్ష్యం వహించిన బంజారాహిల్స్ బొటిక్‌కు భారీ జరిమానా
- సేవా లోపంగా పరిగణించిన కోర్టు

**హైదరాబాద్, మహా:** సాధారణంగా ఏదైనా శుభకార్యం లేదా వివాహ వేడుక ఉందంటే చాలు మహిళలు తమ వేషధారణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. ముఖ్యంగా పట్టుచీరల ఎంపికలో ఎంతటి జాగ్రత్తలు తీసుకుంటారో, వాటికి తగినట్లుగా బ్లౌజ్‌లను డిజైన్ చేయించుకోవడంలోనూ అంతే ఆసక్తి కనబరుస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో చీర ధరకు మించి బ్లౌజ్ స్టిచ్చింగ్ మరియు మగ్గం వర్క్ కోసం వేల రూపాయలు ఖర్చు చేయడం పరిపాటిగా మారింది. ఎందుకంటే చీర అందాన్ని రెట్టింపు చేసేది సరైన ఫిట్టింగ్ మరియు అద్భుతమైన డిజైన్ ఉన్న బ్లౌజ్ మాత్రమే. అయితే, ఎంతో ఇష్టంగా కుట్టించుకోవాలని ఇచ్చిన బ్లౌజ్ ముక్కను టైలర్లు తమ నిర్లక్ష్యంతో పాడు చేస్తే, అది ఆ మహిళలకు కేవలం ఆర్థిక నష్టమే కాకుండా తీవ్రమైన మానసిక వేదనను మిగిల్చుతుంది. సరిగ్గా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో ఒక మహిళకు ఎదురై, చివరకు అది లక్ష రూపాయల పరిహారానికి దారితీసింది.

### బంజారాహిల్స్ బొటిక్ నిర్వాకం

ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్ నివాసి కె. అమృత వర్షిణి తన సోదరుడి వివాహ వేడుక కోసం ఎంతో ఖరీదైన కంచి పట్టుచీరను సిద్ధం చేసుకున్నారు. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని భావించిన ఆమె, తన సోదరుడు బహుమతిగా ఇచ్చిన ఆ పట్టుచీర బ్లౌజ్ ముక్కను స్టిచ్చింగ్ కోసం బంజారాహిల్స్‌లోని 'బీ డిజైన్ ఫర్ యూ' అనే ప్రసిద్ధ టైలరింగ్ సంస్థకు అప్పగించారు. 2025 జనవరి 25న బ్లౌజ్ మెటీరియల్‌తో పాటు స్టిచ్చింగ్ చార్జీల కోసం ముందస్తుగా రూ. 2,500 చెల్లించారు. ఫిబ్రవరి 12వ తేదీ లోపు డెలివరీ ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే, ఆ సంస్థ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆ పట్టుచీర బ్లౌజ్ ముక్కను ఇష్టానుసారంగా కత్తిరించడంతో వివాదం మొదలైంది.

### తప్పుడు కట్టింగ్‌తో మొదలైన తకరారు

బ్లౌజ్ డెలివరీ ఇవ్వాల్సిన గడువు సమీపిస్తున్న తరుణంలో, ఫిబ్రవరి 5న సదరు బొటిక్ నుంచి అమృత వర్షిణికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము పొరపాటున బ్లౌజ్ మెటీరియల్‌ను తప్పుగా కట్ చేశామని, అందుకు క్షమించాలని సిబ్బంది కోరారు. అయితే, జరిగిన తప్పును సరిదిద్దుతామని, ఎవరూ గుర్తుపట్టలేని విధంగా మగ్గం వర్క్ చేసి రీజాయిన్ చేసి ఇస్తామని వారు హామీ ఇచ్చారు. తమపై నమ్మకంతో ఆమె అందుకు అంగీకరించినప్పటికీ, చివరకు వారు ఇచ్చిన అవుట్‌పుట్ ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. బ్లౌజ్ ఆకృతి పూర్తిగా మారిపోవడమే కాకుండా, పెళ్లి వంటి పెద్ద వేడుకలో ధరించడానికి ఏమాత్రం యోగ్యంగా లేకుండా తయారైంది. ఇది ఆమెను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

### మనోవేదనకు గురిచేసిన నిర్లక్ష్యం

తమ కుటుంబంలో జరుగుతున్న ముఖ్యమైన వేడుకలో ధరించాల్సిన చీర పాడైపోవడంతో అమృత వర్షిణి మానసిక క్షోభకు గురయ్యారు. ఆ బ్లౌజ్ లేకుండా ఆ పట్టుచీరను ధరించడం సాధ్యం కాదని, తనకు కొత్త చీర కొనివ్వాలని లేదా దాని పూర్తి విలువను చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. మొదట పరిహారం చెల్లిస్తామని చెప్పిన బొటిక్ నిర్వాహకులు, ఆ తర్వాత ఆమె ఫోన్ కాల్స్‌కు స్పందించడం మానేశారు. వినియోగదారుల పట్ల సదరు సంస్థ చూపిన ఈ అనైతిక వ్యాపార ధోరణి మరియు బాధ్యతారాహిత్యం ఆమెను చట్టపరమైన పోరాటానికి పురికొల్పింది. కేవలం ఒక బ్లౌజ్ కదా అని నిర్లక్ష్యం చేసిన సంస్థకు బుద్ధి చెప్పాలని ఆమె నిర్ణయించుకున్నారు.

### కమిషన్ తలుపు తట్టిన బాధితురాలు

న్యాయం కోసం అమృత వర్షిణి హైదరాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ 1ను ఆశ్రయించారు. తన వద్ద ఉన్న రశీదులు, వాట్సాప్ చాటింగ్ స్క్రీన్ షాట్లు, పాడైపోయిన బ్లౌజ్ ఫోటోలు మరియు ఆ సమయంలో తాను అనుభవించిన మానసిక వేదనను వివరించే ఆధారాలను కమిషన్ ముందు ఉంచారు. ఒక వినియోగదారుడు సేవ కోసం డబ్బు చెల్లించినప్పుడు, ఆ సంస్థ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కానీ ఇక్కడ బొటిక్ యజమాన్యం కనీస వృత్తిపరమైన ప్రమాణాలను పాటించలేదని ఆమె తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ కేసును క్షుణ్ణంగా పరిశీలించిన కమిషన్, సదరు టైలరింగ్ సంస్థది స్పష్టమైన 'సేవా లోపం' అని నిర్ధారించింది.

### చారిత్రాత్మక తీర్పు.. లక్ష రూపాయల జరిమానా

కేసు పూర్వాపరాలను పరిశీలించిన వినియోగదారుల కమిషన్, బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. బహుమతిగా వచ్చిన పట్టుచీరను పాడు చేయడం ద్వారా ఆమెకు కలిగిన మానసిక ఆవేదనకు మరియు ఆర్థిక నష్టానికి గానూ అక్షరాలా రూ. 1,00,000 (లక్ష రూపాయలు) పరిహారంగా చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. దీనితో పాటు కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 10,000 చెల్లించాలని స్పష్టం చేసింది. సాధారణంగా బ్లౌజ్ కదా అని చాలామంది వదిలేస్తుంటారని, కానీ ఇలాంటి నిర్లక్ష్యం వల్ల వినియోగదారుడికి కలిగే అసౌకర్యం చాలా పెద్దదని కమిషన్ అభిప్రాయపడింది. ఈ తీర్పు ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

### సేవా లోపానికి చెక్ పెట్టే దిశగా అడుగులు

డబ్బులు తీసుకుని నాణ్యమైన సేవలు అందించని ఏ సంస్థకైనా ఈ తీర్పు ఒక గట్టి హెచ్చరిక అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. వినియోగదారుల చట్టం ప్రకారం.. వస్తువుల కొనుగోలులోనే కాకుండా, సేవల విషయంలో కూడా వినియోగదారుడికి పూర్తి రక్షణ ఉంటుంది. బొటిక్ నిర్వాహకులు బ్లౌజ్ ముక్కను తప్పుగా కట్ చేయడం కేవలం పొరపాటు మాత్రమే కాదని, అది వారి వృత్తిపరమైన బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుందని కమిషన్ తన తీర్పులో పేర్కొంది. వినియోగదారుల హక్కులను కాలరాసే ఏ సంస్థనైనా ఇలాగే చట్టం ముందుకు తీసుకురావచ్చని ఈ ఘటన నిరూపించింది.

# ఉపాధి పథకానికి కొత్త సొబగులు

- క్షేత్రస్థాయిలో పెరిగిన కష్టాలు
- సాంకేతిక సంకెళ్లలో ఉపాధి కూలీ
- ముఖం గుర్తించని యాప్‌తో వేతనం దూరం
- మారుతున్న వ్యవస్థ.. పెరుగుతున్న నిబంధనలు

**హైదరాబాద్, మహా:** దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. పథకంలో జరుగుతున్న నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా, పాత పద్ధతులకు స్వస్తి పలికి అత్యంత పకడ్బందీగా నిబంధనలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగానే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్' గా మారుస్తూ సాఫ్ట్‌వేర్‌లో సమూల మార్పులు చేపట్టింది. ప్రతి గ్రామానికి ప్రత్యేకమైన ఐటీ గుర్తింపుతో పాటు పాస్‌వర్డ్‌లను కేటాయించి, ప్రతి కూలీ వివరాలను ముందుగానే కేవైసీ ప్రక్రియ ద్వారా అనుసంధానించింది. అయితే, ఈ సాంకేతిక విప్లవం క్షేత్రస్థాయిలో కూలీల పాలిట శాపంగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**ముఖం చాటేస్తున్న యాప్.. అగచాట్లు పడుతున్న కూలీలు**

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల హాజరును నమోదు చేసేందుకు ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారింది. కూలీల ముఖాలను మరియు కనుపాపలను స్కాన్ చేయడం ద్వారా హాజరును గుర్తించాల్సి ఉండగా, సాంకేతిక లోపాలు కూలీల పొట్ట కొడుతున్నాయి. వెలుతురు సరిగ్గా లేకపోయినా, మొబైల్ కెమెరా నాణ్యత తక్కువగా ఉన్నా యాప్ కూలీల ముఖాలను గుర్తించడం లేదు. గడ్డం పెరగడం, జుట్టు తీయించుకోవడం, లేదా వయసు ప్రభావంతో ముఖంలో వచ్చే సహజ మార్పులను కూడా ఈ సాఫ్ట్‌వేర్ 'మిస్ మ్యాచ్' అంటూ తిరస్కరిస్తోంది. దీంతో పనులకు వెళ్లినా హాజరు పడక వేతనం కోల్పోవాల్సి వస్తోందని పేద కూలీలు వాపోతున్నారు.

**రెట్టింపు భారంగా మారిన హాజరు నమోదు**

కొత్త నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలు పని ప్రదేశంలో తమ ఫోటోలను రెండు సార్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తొలుత పని ప్రారంభించే సమయంలో ఒకసారి, ఆ తర్వాత నాలుగు గంటల పని ముగిశాక రెండోసారి ఫోటో తీయాలి. ఈ రెండు ఫోటోలు సక్రమంగా అప్‌లోడ్ అయితేనే ఆ రోజు కూలీ మంజూరవుతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడం, సర్వర్లు మొరాయించడం వంటి కారణాలతో ఫోటోలు అప్‌లోడ్ కాక మేట్లు మరియు కూలీలు గంటల తరబడి పని ప్రదేశంలోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఒక్కోసారి ఉదయం ఫోటో పడి, మధ్యాహ్నం ఫోటో అప్‌లోడ్ కాకపోయినా ఆ రోజంతా చేసిన కష్టం వృథా అవుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిరాశ మిగిలిస్తున్న శారీరక మార్పులు**

సాంకేతికత ఎంత ఆధునికంగా ఉన్నా, మనుషుల శారీరక స్థితిగతులను అర్థం చేసుకోవడంలో విఫలమవుతోంది. అనారోగ్యం కారణంగా ముఖం వాచినా లేదా ముఖంలో అలసట ఉన్నా యాప్ గుర్తించడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ముఖ్యంగా గిరిజన తండాల్లో నివసించే నిరుపేదలకు ఈ సమస్య మరింత జటిలమవుతోంది. ఉదాహరణకు, మద్దిమల్ల తండాకు చెందిన భూక్య లింబి వంటి కూలీలు తమ పుట్టుకతో వచ్చిన శారీరక లక్షణాల వల్ల ఉపాధిని కోల్పోతున్నారు. కళ్లు చిన్నవిగా ఉండటం వల్ల సాఫ్ట్‌వేర్ ఆమె కనుపాపలను గుర్తించలేకపోతోంది, ఫలితంగా వృద్ధాప్యంలో ఉన్న ఆమెకు ఏకైక జీవనాధారమైన ఉపాధి హామీ పనులు దక్కకుండా పోతున్నాయి.

**బడ్జెట్ కేటాయింపుల్లో అనిశ్చితి**

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా, ఇంతవరకు 202627 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు జరగకపోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 2.50 కోట్ల పనిదినాలను కేటాయించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, జిల్లాల వారీగా నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించలేదు. పథకం పేరు మార్పు మరియు సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియలో జాప్యం జరగడం వల్ల నిధుల విడుదల మరియు పనుల గుర్తింపులో అయోమయం నెలకొంది. ఏటా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టే అధికారులు, ఈసారి బడ్జెట్ స్పష్టత లేకపోవడంతో కేవలం వచ్చిన కోటా మేరకు పనులు కల్పిస్తూ నెట్టుకొస్తున్నారు.

**లక్ష్యం లేని పనులు.. దిక్కుతోచని యంత్రాంగం**

సాఫ్ట్‌వేర్ మార్పుల వల్ల బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోవడంతో ఏ ప్రాంతంలో ఏ పనులు చేపట్టాలనే విషయంలో అధికారులకు స్పష్టత కరువైంది. సాధారణంగా వేసవి కాలంలో చెరువుల పూడికతీత వంటి పనులు ముమ్మరంగా జరగాలి, కానీ ప్రస్తుతం నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడంతో కూలీలకు ఏ పనులు కేటాయించాలో తెలియని స్థితి నెలకొంది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తయితే తప్ప నిధుల వినియోగంపై పూర్తిస్థాయి పారదర్శకత రాదని కేంద్రం భావిస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం పనుల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారింది. సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా పనుల రిపోర్టింగ్ కూడా ఆలస్యమవుతోంది.

**భానుడి భగభగలు.. కూలీలకు మజ్జిగ ఊరట**

ఒకవైపు సాంకేతిక సమస్యలు వేధిస్తున్నా, మరోవైపు భానుడి ప్రతాపం ఉపాధి కూలీలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పని ప్రదేశాల్లో కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. నీడ సౌకర్యం కల్పించడంతో పాటు, అత్యవసర వైద్య కిట్లను అందుబాటులో ఉంచారు. సాంకేతిక సంకెళ్లను దాటుకుని వేతనం వస్తుందో లేదో తెలియని స్థితిలో కూడా, ఎండను తట్టుకుంటూ తమ జీవనం కోసం కూలీలు శ్రమిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్ది, బడ్జెట్ కేటాయింపులు జరపాలని వారు కోరుతున్నారు.

# ఆప్‌కు బిగ్ షాక్

- ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటుకు పిటిషన్
- విలీనంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- ఫిరాయింపుల నిరోధక చట్టం నీడలో ఏడుగురు సభ్యులు
- ఛైర్మన్‌కు సంజయ్ సింగ్ విన్నపం



**హైదరాబాద్, మహా:** దేశ రాజధాని రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పునాదులను కదిలించేలా ఏకంగా ఏడుగురు రాజ్యసభ సభ్యులు పార్టీకి గుడ్ బై చెప్పి భారతీయ జనతా పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామంపై ఆప్ తీవ్రంగా స్పందించింది. పార్టీ ఫిరాయించిన సదరు ఎంపీలపై తక్షణమే అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ ఆప్ సీనియర్ నేత, ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి అధికారికంగా పిటిషన్ సమర్పించారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీకి ఇది చరిత్రలో ఎదురైన అతిపెద్ద సంక్షోభంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫిరాయింపులు కేవలం రాజకీయ మార్పులు మాత్రమే కావని, ప్రజాతీర్పును అవమానపరచడమేనని ఆప్ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**రాజ్యసభలో మారిన బలాబలాలు**

రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న బలం ఈ పరిణామంతో అమాంతం పడిపోయింది. మొత్తం 10 మంది సభ్యులలో ఏడుగురు ఒకేసారి కండువా మార్చేయడంతో ఆ పార్టీ ప్రాతినిధ్యం నామమాత్రంగా మారింది. శుక్రవారం చోటుచేసుకున్న ఈ పరిణామాల్లో రాఘవ్ చద్దా, అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్నీ మరియు స్వాతి మలివాల్ వంటి కీలక నేతలు బీజేపీలో చేరారు. పార్టీ తన ప్రాథమిక సిద్ధాంతాల నుంచి తప్పుకుందని, నైతిక విలువలను గాలికొదిలేసిందని ఆరోపిస్తూ వీరంతా తమ రాజీనామా లేఖలను సమర్పించారు. ముఖ్యంగా కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా పేరున్న నేతలు కూడా ఈ జాబితాలో ఉండటం ఆ పార్టీ కేడర్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది.

**విలీన వాదం వినిపిస్తున్న రాఘవ్ చద్దా**

తమపై అనర్హత వేటు పడే అవకాశం లేదని, ఇది సాంకేతికంగా విలీనం కిందకు వస్తుందని బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా వాదిస్తున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం, ఒక పార్టీకి ఉన్న మొత్తం సభ్యులలో మూడింట రెండు వంతుల మంది (2/3rd) వేరే పార్టీలో చేరితే, అది ఫిరాయింపు కిందకు రాదని, చట్టబద్ధమైన విలీనంగా పరిగణించబడుతుందని ఆయన గుర్తు చేస్తున్నారు. ఆప్‌కు ఉన్న 10 మందిలో 7 మంది అంటే 70 శాతం మంది తరలివచ్చారు కాబట్టి, తమ సభ్యత్వాలకు ఎటువంటి ప్రమాదం లేదని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజ్యసభ రికార్డుల్లో కూడా తాము బీజేపీ సభ్యులుగానే గుర్తింపు పొందుతామని వారు ఆశాభావంతో ఉన్నారు.

**పంజాబ్ ఓటర్లకు ద్రోహమని ఆవేదన**

ఈ ఫిరాయింపుల వెనుక రాజకీయ కుట్ర ఉందని సంజయ్ సింగ్ మండిపడుతున్నారు. ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఆరుగురు ఎంపీలు పార్టీ మారడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజాబ్ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని విశ్వసించి ఓటు వేస్తే, ఆ నమ్మకాన్ని ఈ ఎంపీలు వమ్ము చేశారని ఆయన విమర్శించారు. ఇది కేవలం పార్టీ మార్పు మాత్రమే కాదని, పంజాబ్ ఆత్మగౌరవాన్ని బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడమేనని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు తమను రాజ్యసభకు పంపింది ఆప్ అభ్యర్థులుగా అన్న విషయాన్ని వారు మర్చిపోయారని, ఇది ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

**రాజ్యాంగ నిపుణుల సలహాలు**

ఈ న్యాయపోరాటంలో వెనక్కి తగ్గేది లేదని ఆప్ స్పష్టం చేస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై దేశంలోని ప్రముఖ రాజ్యాంగ నిపుణులు మరియు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో సంజయ్ సింగ్ చర్చలు జరిపారు. లోక్ సభ మాజీ సెక్రటరీ జనరల్ వంటి అనుభవజ్ఞుల సలహాలు కూడా తీసుకున్నారు. విలీన వాదం అనేది సాంకేతికంగా అన్ని వేళలా వర్తించదని, పార్టీ నుంచి విడిపోయే ప్రక్రియలో పాటించాల్సిన నియమాలను ఈ ఎంపీలు ఉల్లంఘించారని ఆప్ న్యాయ నిపుణులు వాదిస్తున్నారు. ఛైర్మన్ వద్ద ఈ వాదనలు గట్టిగా వినిపించి, ఏడుగురు ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయించడమే లక్ష్యంగా ఆప్ పావులు కదుపుతోంది.

**క్షేత్రస్థాయిలో నిరసన జ్వాలలు**

మరోవైపు, పార్టీని వీడిన ఎంపీలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ఆప్ కార్యకర్తలు నిరసనలకు దిగారు. ముఖ్యంగా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తీరుపై పంజాబ్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జలంధర్‌లోని ఆయన నివాసం వెలుపల భారీ సంఖ్యలో గుమిగూడిన ఆప్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. "విశ్వాసఘాతుక ఎంపీలు తిరిగి రావాలి" అంటూ నినాదాలు చేశారు. కేవలం అధికారం కోసం, వ్యక్తిగత లాభాల కోసం పార్టీని వీడారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఎంపీల నివాసాల వద్ద కూడా ఇలాంటి నిరసనలు కొనసాగుతుండటంతో పోలీసులు భారీగా మోహరించారు.

**సిద్ధాంతాల సంఘర్షణ**

బీజేపీలో చేరిన నేతలు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ ఆప్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిందని, కేవలం కొద్దిమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతమైందని వారు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన పార్టీ, ఇప్పుడు అదే ఊబిలో కూరుకుపోయిందని, అందుకే తాము నైతిక విలువలతో కూడిన రాజకీయం కోసం బీజేపీని ఎంచుకున్నామని రాఘవ్ చద్దా సహా ఇతర నేతలు పేర్కొన్నారు. అయితే, ఇవన్నీ కేవలం ఫిరాయింపులను కప్పిపుచ్చుకోవడానికి చెబుతున్న సాకులు మాత్రమేనని, వారి అసలు రంగు బయటపడిందని ఆప్ ఎదురుదాడి చేస్తోంది.

**చట్టబద్ధమైన చర్యలకు సిద్ధమైన ఆప్**

రాజ్యసభ ఛైర్మన్ నిర్ణయం కోసం ఆప్ వర్గాలు వేచి చూస్తున్నాయి. పిటిషన్ అందజేసిన అనంతరం సంజయ్ సింగ్ మాట్లాడుతూ, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజ్యసభ నియమావళి ప్రకారం ఫిరాయింపుదారులకు శిక్ష తప్పదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఛైర్మన్ తీసుకునే నిర్ణయం భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం యొక్క అసలు స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ఛైర్మన్‌పై ఉందని, ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా ఆప్ వర్సెస్ బీజేపీ రాజకీయం మరోసారి వేడెక్కింది.

# మతువా ధామంలో ప్రధాని మోదీ

- బోరోమా స్మృతిలో భావోద్వేగ పర్యటన
- హరిచంద్, గురుచంద్ ఠాకూర్‌ల ఆశయాలు సమాజానికి దిక్సూచి
- పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న నరేంద్ర మోదీ



**హైదరాబాద్, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్‌లోని మతువా సామాజిక వర్గ పవిత్ర పుణ్యక్షేత్రం మతువా ఠాకూర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్రమైన ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో అడుగుపెట్టిన ప్రధాని, అక్కడ కొలువై ఉన్న దైవానికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. దేశాభివృద్ధి, ప్రజల క్షేమం కోరుతూ ఆయన ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మతువా మత గురువుల ఆశీస్సులు పొందిన అనంతరం ఆయన ఆ ప్రాంగణంలో గడిపిన క్షణాలు భక్తిపారవశ్యాన్ని నింపాయి. ఈ పర్యటన కేవలం ఒక పర్యటనగా కాకుండా, ఆ సామాజిక వర్గంతో ఆయనకు ఉన్న విడదీయరాని బంధానికి ప్రతిరూపంగా నిలిచింది.

**బోరోమా బినాపాణి దేవి జ్ఞాపకాల్లో..**

ఈ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని ఏళ్ల క్రితం తాను ఇదే ఆలయాన్ని సందర్శించినప్పుడు, మతువా వర్గ మాతృమూర్తి 'బోరోమా' బినాపాణి ఠాకూర్ నుంచి పొందిన ఆశీస్సులను ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. నాటి పర్యటనలో బోరోమా తనను ఎంతో ఆప్యాయంగా పలకరించి, దీవించిన తీరును గుర్తుచేస్తూ అప్పటి ఫోటోను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆమె చూపిన వాత్సల్యం, మార్గదర్శకత్వం తన జీవితంలో చెరగని ముద్ర వేశాయని, నేడు ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె దీవెనలు ఎప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

**సమాజానికి వెలుగుచూపే మహనీయుల ఆశయాలు**

మతువా వర్గ వ్యవస్థాపకులు శ్రీశ్రీ హరిచంద్ ఠాకూర్ జీ, శ్రీశ్రీ గురుచంద్ ఠాకూర్ జీల ఆశయాలు నేటికీ మన సమాజానికి గొప్ప మార్గదర్శకాలుగా ఉన్నాయని ప్రధాని ప్రశంసించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం వారు చేసిన కృషి వెలకట్టలేనిదని ఆయన కొనియాడారు. వారి బోధనలు కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, యావత్ భారతదేశ ప్రగతికి, సమగ్రతకు పునాదులని మోదీ అభివర్ణించారు. ఆ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా, సబ్‌కా సాత్‌సబ్‌కా వికాస్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

**సామాజిక చైతన్యానికి మతువా ఉద్యమం మూలం**

మతువా సంప్రదాయం అనేది కేవలం ఒక మతపరమైన అంశమే కాకుండా, అది ఒక గొప్ప సామాజిక సంస్కరణల విప్లవమని ప్రధాని విశ్లేషించారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన గురుచంద్ ఠాకూర్ ప్రయాణం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంటరానితనం, సామాజిక వివక్ష లేని సమాజం కోసం వారు పోరాడిన తీరును ఆయన గుర్తుచేశారు. నేడు భారతదేశం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతున్న తరుణంలో, మూలాలను మర్చిపోకుండా ఇటువంటి ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

**శరణార్థుల పాలిట అండగా నిలిచిన క్షేత్రం**

చారిత్రాత్మకంగా మతువా ఠాకూర్ ఆలయానికి మరియు ఆ సామాజిక వర్గానికి దేశ విభజన సమయంలో ఏర్పడిన పరిస్థితులతో లోతైన సంబంధం ఉంది. లక్షలాది మంది శరణార్థులకు ఆశ్రయం కల్పించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపిన ఈ నేల తనకెంతో పవిత్రమైనదని ప్రధాని వ్యాఖ్యానించారు. వారి హక్కుల కోసం, పౌరసత్వం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆ వర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో తాను బంగ్లాదేశ్‌లోని ఒరకండిలో ఉన్న మతువా ఆలయాన్ని సందర్శించిన సందర్భాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత**

వారసత్వ సంపదను, ఆధ్యాత్మిక కేంద్రాలను పరిరక్షించడం ద్వారానే దేశ సంస్కృతి సజీవంగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మతువా ఠాకూర్ ఆలయ అభివృద్ధికి, ఆ ప్రాంత సౌకర్యాల మెరుగుదలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. భవిష్యత్ తరాలకు హరిచంద్ ఠాకూర్ వంటి మహనీయుల చరిత్రను అందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రార్థనలు ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలో ప్రధానికి మతువా వర్గ ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ పర్యటన మతువా సామాజిక వర్గంలో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, ప్రధాని వ్యక్తిగత నిబద్ధతను చాటిచెప్పింది.

# ఉప్పల్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు



**హైదరాబాద్, మహా:** నగరంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నేటి నుండి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఉప్పల్ నుండి ఘటకేసర్ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ మరియు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసే ఉద్దేశంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప్పల్ కూడలి గుండా ప్రయాణించే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మళ్లింపు ఉత్తర్వులను జారీ చేశారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భారీ క్రేన్లు, యంత్రాలను మోహరించిన నేపథ్యంలో భద్రతా దృష్ట్యా ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ విభాగం వెల్లడించింది. దీనివల్ల ఉప్పల్ మీదుగా ప్రయాణించే వేలాది మంది వాహనదారులపై ప్రభావం పడనుంది.

**వరంగల్ బస్సులకు కొత్త చిరునామా**

హన్మకొండ మరియు వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న బస్టాండ్‌ను తాత్కాలికంగా మూసివేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా నల్లచెరువు వద్ద తాత్కాలిక బస్టాండ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. నేటి నుండి వరంగల్ మార్గంలో వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ నల్లచెరువు వద్దే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోనున్నాయి. రింగ్ రోడ్డు వద్ద బస్సుల నిలుపుదల కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో, నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆర్టీసీ మరియు పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**బోడుప్పల్ నుండి నాగోల్ వెళ్లే వారికి సూచనలు**

బోడుప్పల్ మరియు పీర్జాదిగూడ ప్రాంతాల నుండి నాగోల్, ఎల్బీనగర్ వైపు వెళ్లే వాహనదారులు ఉప్పల్ రింగ్ రోడ్డులోకి రాకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని అనుసరించాల్సి ఉంటుంది. ఈ వాహనాలు ఏషియన్ సినిమాస్ వద్ద నుంచి మల్లి భగాయత్ లేఅవుట్ లోపలి దారి ద్వారా నాగోల్ మెయిన్ రోడ్డుకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఈ అంతర్గత రహదారుల ద్వారా ప్రయాణించడం వల్ల రింగ్ రోడ్డు వద్ద నిర్మాణ పనుల వద్ద ఏర్పడే రద్దీని తగ్గించే అవకాశం ఉంటుంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు ముఖ్యమైన కూడళ్ల వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**భారీ వాహనాల కోసం సుదీర్ఘ మళ్లింపు**

సికింద్రాబాద్ నుండి వరంగల్ జాతీయ రహదారి వైపు వెళ్లే భారీ వాహనాలపై కఠినమైన ఆంక్షలు విధించారు. లారీలు మరియు ఇతర పెద్ద రవాణా వాహనాలు హబ్సిగూడ నుండి ఉప్పల్ వైపు రాకుండా, నాచారం మీదుగా చెంగిచర్ల చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుండి వరంగల్ హైవేకు అనుసంధానించే మార్గాల ద్వారా జాతీయ రహదారికి చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. నగరంలోకి భారీ వాహనాల రాకపోకల వల్ల పనులకు అంతరాయం కలగకుండా ఈ సుదీర్ఘ మళ్లింపును అమలు చేస్తున్నారు. ఈ మార్పుల వల్ల రవాణా ఖర్చులు మరియు సమయం కొంత పెరిగే అవకాశం ఉందని లారీ యజమానులు అభిప్రాయపడుతున్నారు. సికింద్రాబాద్ నుండి వరంగల్ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు మరియు కార్ల కోసం అధికారులు కొంత ఊరటనిచ్చే మార్గాన్ని సూచించారు. ఈ వాహనాలు ఉప్పల్ మెయిన్ రోడ్డు మీదుగా వెళ్లే బదులు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక వైపు ఉన్న రహదారి గుండా ప్రయాణించి వరంగల్ హైవేకి చేరుకోవచ్చు.

# ఐఎస్ఐ కుట్రలను చిత్తు చేసిన అజిత్ దోవల్

## బంగ్లాదేశ్ వాయుసేనలో భారీ ప్రక్షాళన

- భారత్ నిఘా సమాచారంతో చిక్కిన 120 మంది పాక్ గూఢచారులు
- గడగడలాడిన ఐఎస్ఐ నెట్‌వర్క్
- సిలిగురి కారిడార్ లక్ష్యంగా సాగుతున్న దేశద్రోహ పన్నాగం బట్టబయలు
- రంగంలోకి దిగిన బంగ్లాదేశ్ భద్రతా దళాలు



**హైదరాబాద్, మహా:** ఢిల్లీ వేదికగా జరిగిన భారత్, బంగ్లాదేశ్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం పొరుగు దేశాల భద్రతా సమీకరణాల్లో పెను మార్పులకు దారితీసింది. 2026 ఏప్రిల్ 7వ తేదీన జరిగిన ఈ కీలక భేటీలో భారత ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ తన అపారమైన అనుభవం మరియు నిఘా వర్గాల సమాచారంతో పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ (ISI) పన్నాగాలను బహిర్గతం చేశారు. బంగ్లాదేశ్ గడ్డపై ఉంటూ భారత్‌కు వ్యతిరేకంగా సాగుతున్న అంతర్గత కుట్రలను సాక్ష్యాలతో సహా ఆయన బంగ్లాదేశ్ ఎన్ఎస్ఏ ముందు ఉంచారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కేవలం వాణిజ్యానికే పరిమితం కాకుండా, ఉగ్రవాద నిర్మూలనలో ఎంతటి పటిష్టంగా ఉన్నాయో ఈ భేటీ నిరూపించింది.

**వాయుసేనలో పాక్ ఏజెంట్ల చొరబాటు**

బంగ్లాదేశ్ వాయుసేన వంటి అత్యంత సున్నితమైన విభాగంలో పాకిస్థాన్ ఏజెంట్లు ఏ స్థాయిలో వేళ్లూనుకున్నారో అజిత్ దోవల్ వివరించిన తీరు అధికారులను విస్మయానికి గురిచేసింది. గత కొంతకాలంగా ఐఎస్ఐ నెట్‌వర్క్ బంగ్లాదేశ్ సైనిక దళాల్లోని కొంతమందిని ప్రలోభాలకు గురిచేసి, తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు భారత నిఘా సంస్థలు పసిగట్టాయి. ఈ సమాచారం అందిన వెంటనే బంగ్లాదేశ్ ప్రభుత్వం అత్యంత గోప్యంగా విచారణను ప్రారంభించింది. వ్యవస్థలో లోపల ఉంటూనే శత్రుదేశానికి సహకరిస్తున్న వారి వివరాలను భారత అధికారులు అందించడంతో ఆపరేషన్ వేగవంతమైంది.

**భారీ స్థాయిలో అరెస్టుల పర్వం**

భారత్ అందించిన ఖచ్చితమైన సమాచారంతో బంగ్లాదేశ్ భద్రతా బలగాలు తమ వాయుసేనలో భారీ ప్రక్షాళన చేపట్టాయి. ఈ ఆపరేషన్ ఫలితంగా సుమారు 100 మందికి పైగా ఎయిర్‌మెన్‌లు మరియు 20 మందికి పైగా ఉన్నతాధికారులను దేశద్రోహం ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. వీరంతా పాక్ గూఢచారి సంస్థతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుని, దేశ రక్షణ రహస్యాలను చేరవేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఇంత పెద్ద సంఖ్యలో సైనిక సిబ్బంది అరెస్ట్ కావడం బంగ్లాదేశ్ సైనిక చరిత్రలోనే ఒక సంచలనంగా మారింది.

**సిలిగురి కారిడార్‌పై నిఘా కుట్ర**

ఐఎస్ఐ ఏజెంట్లు ప్రధానంగా భారత్‌కు అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్ లేదా 'చికెన్ నెక్' ప్రాంతంపై దృష్టి సారించినట్లు ఆధారాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఇరుకైన భూభాగం ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు భారత్ అనుసంధానమై ఉంటుంది. ఇక్కడ జరిగే సైనిక కదలికలు మరియు బంగాళాఖాతం సమీపంలోని భారత రక్షణ వ్యవస్థల సమాచారాన్ని సేకరించి ఐఎస్ఐకి చేరవేసే బాధ్యతను ఈ ఏజెంట్లకు అప్పగించినట్లు తేలింది. భారత్ యొక్క వ్యూహాత్మక ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ కుట్రను దోవల్ వ్యూహం సమర్థవంతంగా తిప్పికొట్టింది.

**నిఘా వర్గాల అప్రమత్తత - ఆర్ అండ్ ఏడబ్ల్యూ పటిష్టత**

భారత నిఘా సంస్థ 'ఆర్ అండ్ ఏడబ్ల్యూ' (R&AW) యొక్క పనితీరు ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించింది. పొరుగు దేశాల్లోని పరిణామాలను నిశితంగా గమనిస్తూ, శత్రువుల ప్రతి కదలికపై నిఘా ఉంచడం వల్లనే ఈ భారీ కుట్రను ప్రాథమిక దశలోనే అడ్డుకోవడం సాధ్యమైంది. ఎక్కడెక్కడ ఏజెంట్లు దాగి ఉన్నారో క్లియర్ కట్ స్కెచ్ వేసి మరీ వారిని ఏరిపారేయడంలో భారత నిఘా వర్గాలు చూపిన చాకచక్యం గ్లోబల్ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ ఘటన ద్వారా భారత్ స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది.

**ఐఎస్ఐ వ్యూహం అట్టర్ ఫ్లాప్**

దశాబ్దాలుగా భారత వ్యతిరేక కార్యకలాపాలకు బంగ్లాదేశ్ గడ్డను వాడుకోవాలని ప్రయత్నిస్తున్న ఐఎస్ఐకి ఇది కోలుకోలేని దెబ్బ. సైనిక దళాల్లో విభేదాలు సృష్టించడం లేదా గూఢచర్యంతో సమాచారాన్ని దొంగిలించడం వంటి పాత కాలపు పద్ధతులకు ఆధునిక సాంకేతికతతో కూడిన నిఘా వ్యవస్థ చెక్ పెట్టింది. పాకిస్థాన్ పన్నిన ఈ నెట్‌వర్క్ పేకమేడలా కూలిపోవడంతో వారి అంతర్జాతీయ కుట్రలు మరోసారి బట్టబయలయ్యాయి. బంగ్లాదేశ్ తన రక్షణ వ్యవస్థను ప్రక్షాళన చేసుకోవడానికి భారత్ అందించిన ఈ సహకారం ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని మరింత పెంచింది.

**ప్రాంతీయ భద్రతలో కొత్త అధ్యాయం**

దక్షిణాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడటంలో భారత్ నాయకత్వ పాత్రను ఈ పరిణామం మరోసారి చాటిచెప్పింది. ఉగ్రవాద మూలాలు ఎక్కడ ఉన్నా వాటిని తుడిచిపెట్టేందుకు పొరుగు దేశాలతో సమన్వయం చేసుకోవడం అత్యవసరమని అజిత్ దోవల్ ఈ భేటీ ద్వారా నిరూపించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా భారత్ హెచ్చరికలను సానుకూలంగా స్వీకరించి, తన సొంత భద్రతా ప్రయోజనాల దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవడం గమనార్హం. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల రక్షణ సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశం తీర్మానించింది.

**భవిష్యత్తు సవాళ్లు మరియు అప్రమత్తత**

గూఢచారుల ఏరివేత ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం అందుతోంది. అరెస్ట్ అయిన వారి నుంచి లభించిన సమాచారం ఆధారంగా దేశవ్యాప్తంగా ఇతర విభాగాల్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న క్రమంలో సైబర్ గూఢచర్యం మరియు అంతర్గత ఇన్ఫార్మర్ల ముప్పు పెరిగిందని, దీనిపై నిరంతరం నిఘా ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. అజిత్ దోవల్ వంటి వ్యూహకర్తల పర్యవేక్షణలో భారత భద్రతా వలయం మరింత పటిష్టంగా మారిందని, శత్రువుల ఎటువంటి ప్లాన్ అయినా భారత్ ముందు అట్టర్ ఫ్లాప్ అవ్వాల్సిందేనని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.



## నటి అషురెడ్డిపై కేసు నమోదు..
## పెళ్లి పేరుతో రూ. 9 కోట్లు మోసం

బిగ్‌బాస్ ఫేమ్, సినీనటి అషురెడ్డి(అశ్విని రెడ్డి)పై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిందని హైదరాబాద్ షేక్‌పేట్‌కు చెందిన వై.వి.ధర్మేంద్ర ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తన నుంచి రూ.9.35 కోట్లు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా తాను పని చేస్తున్నానని చెప్పిన ధర్మేంద్ర.. 2018లో భారత్‌కు వచ్చిన సమయంలో అషురెడ్డి పరిచయమైనట్లు పేర్కొన్నారు. పోలీసులతో ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 'అమెరికాలో చదువు పూర్తి చేసి సినిమా ఛాన్స్‌లో కోసం హైదాబాద్ వచ్చినట్లు అషురెడ్డి చెప్పింది. మా అబ్బాయికి పరిచయం అయిన కొద్దిరోజుల్లోనే ప్రేమిస్తున్నాని చెప్పి పెళ్లి చేసుకుందామని నమ్మించింది. ఈ క్రమంలో మా అబ్బాయిని డబ్బులు అడగటం మొదలు పెట్టింది. బంగారం, కారు పలు ఆస్తులను కొనుగోలు చేయించుకుని తన పేరుతోనే రిజిస్టర్ చేయించుకుంది. అయితే, కొద్దిరోజుల క్రితం ధర్మేంద్రను కలిశారు. అషురెడ్డితో పెళ్లి సంబంధాన్ని ఖాయం చేస్తున్నామని ముహూర్తం కోసం పూజారిని కూడా పిలిపించి హడావుడి చేశారు. కానీ, వెంటనే ముఖం చాటేసి పెళ్లికి నిరాకరించారు. గతేడాది వరకు నా కుమారుడితో ఆమె టచ్‌లోనే ఉంది. ఇప్పటి వరకు రూ.9.35 కోట్ల వరకు నగదు, సుమారు 5 కిలోల బంగారం, కారు, ఫ్లాట్ కొనుగోలు చేసి తన పేరుతోరాయించుకుంది. ఆమెతో పాటు తన సోదరి కూడా రూ. 50 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వలేదు.' అని ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పేర్కొన్నారు. దీంతో హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.



### ప్రభాస్, రవితేజతో బ్లాక్ బస్టర్స్..
### 3 భాషలలో 9 సినిమాలతో ఇండస్ట్రీలో సంచలనం..

## 27 ఏళ్లకే సినిమాలకు దూరం..

సినీరంగంలో తక్కువ సమయంలోనే విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న హీరోయిన్ ఆమె. కొన్నాళ్ల క్రితం తెలుగు కుర్రాళ్ల కలల రాణి ఆమె. రవితేజ, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ కెరీర్ మంచి ఫాంలో ఫాంలో ఉండగానే 27 ఏళ్ల వయసులో సినిమాలకు గుడ్ బై చెప్పేసింది. ప్రస్తుతం పెళ్లి చేసుకుని తల్లిగా, భార్యగా తన లైఫ్ గడిపేస్తుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? ఆమె మరెవరో కాదు. హీరోయిన్ రిచా గంగోపాధ్యాయ్. చాలా తక్కువ సమయంలోనే ఒక అరుదైన ఘనతను సాధించారు. 2010 నుండి 2013 మధ్య, ఆమె తెలుగు, తమిళ, బెంగాలీ భాషలలో తొమ్మిది చిత్రాలలో నటించారు. అంతేకాకుండా వెంకటేష్, నాగార్జున, రవి తేజ, ప్రభాస్, రానా దగ్గుబాటి, ధనుష్ వంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తన కెరీర్‌లో ఆమె ఆరు ఉత్తమ నటి అవార్డులను గెలుచుకున్నారు. ఆ తర్వాత, చాలా మంది నటీమణులు ఇంకా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయంలోనే అంటే కేవలం 27 ఏళ్ల వయసులోనే సినిమాలకు దూరమయ్యారు. అందుకు కారణం ఆమె మార్కెటింగ్ చదవాలనుకోవడమే. రిచా మిచిగాన్‌లో పెరిగింది. అక్కడ, 2007లో న్యూజెర్సీలో జరిగిన 26వ వార్షిక అందాల పోటీలో ఆమె మిస్ ఇండియా యూఎస్ఏ టైటిల్‌ను గెలుచుకుంది. అదే సంవత్సరంలో మిస్ మిచిగాన్, మిస్ కంజీనియాలిటీ, మిస్ ఫోటోజెనిక్ టైటిళ్లను కూడా కైవసం చేసుకుంది. 2008లో, ఆమె ముంబైకి వెళ్లి , అనుపమ్ ఖేర్ యాక్టింగ్ స్కూల్ 'యాక్టర్ ప్రిపేర్స్'లో చేరింది. రెండేళ్లలోపే రానా నటించిన లీడర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత వెంకటేశ్ నటించిన నాగవల్లి చిత్రంలో ఛాన్స్ కొట్టేసింది. రవితేజ జోడిగా మిరపకాయ్ సినిమాలో నటించింది. ప్రభాస్, అనుష్క కలిసి నటించిన మిర్చి సినిమాతో రిచా కెరీర్ మారిపోయింది. ఈ మూవీతో తెలుగులో విపరతీమైన ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. కేవలం నాలుగేళ్ల సినీ ప్రయాణంలో మూడు భాషలలో మొత్తం సినిమాలు చేసింది. 2013 అక్టోబర్‌లో, ఆమె తన MBAను చదవడానికి సినిమాల నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో పనిచేసిన మాజీ US ఆర్మీ అధికారి అయిన తన భర్త జో లాంగెల్లాను కలిసింది. వారిద్దరూ 2019లో వివాహం చేసుకున్నారు. వారికి మే 2021లో ఒక కుమారుడు జన్మించాడు.



### మోడరన్ డ్రెస్ లో మోత పుట్టిస్తున్న మాళవిక..
## బాబోయ్ పిక్స్ పీక్స్

ప్రముఖ సినిమాటోగ్రఫర్ మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన మాళవిక మోహనన్ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 2013లో 'పట్టమ్ పోలే' మూవీతో కథానాయికగా పరిచయమైంది మాళవిక మోహనన్. ఆ తర్వాత నటించిన మలయాళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తమిళంలో పేట, మాస్టర్ వంటి చిత్రాల నటించి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఆమె కార్తీ సరసన 'సర్దార్ 2' లో నటిస్తోంది. భాషతో సంబంధం లేకుండా సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదిగేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. అలాగే బాలీవుడ్‌లో కూడా మంచి స్క్రిప్టుల కోసం ఎదురుచూస్తోంది. తనకంటూ ఒక ప్రత్యేకమైన లేడీ ఓరియంటెడ్ సినిమా చేయాలనేది ఆమె కోరిక. రోజు రోజుకు ఈ బ్యూటీ గ్లామర్ డోస్ కూడా రెట్టింపు చేసి తన అందచందాలతో మైమరిపిస్తుంది. తాజాగా సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.

## విలువలు ముఖ్యం.. కోట్ల డబ్బును కాదన్న జి.వి. ప్రకాష్

సినిమా, స్పోర్ట్స్ రంగాలకు చెందిన అగ్ర నటులు, గొప్ప క్రీడాకారులు భారీ రెమ్యునరేషన్ తీసుకుంటారనే విషయం తెలిసిందే. అయితే, వృత్తిపరంగా తీసుకునేంత రేంజ్‌లో వాణిజ్య ప్రకటనలకు కూడా భారీ మొత్తంలో డబ్బు తీసుకుంటారు. ఇందులో కొందరు మాత్రం 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్న చందంగా దొరికిన ప్రతి బ్రాండ్‌లకు ప్రచారం చేసి బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకుంటారు. మరికొందరు సమాజ హితం కోరి ప్రజలకు హాని చేసే వస్తువులకు ప్రమోషన్ చేయరు. ఇప్పుడు ఇదే కోవలో సంగీత దర్శకుడు జి. వి. ప్రకాష్ కుమార్ ఉన్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల విషయంలో సంగీత దర్శకుడు జి. వి. ప్రకాష్ కుమార్ ఒక బలమైన ప్రకటన చేశారు. భారీ రెమ్యునరేషన్ ఇస్తామని ఆఫర్లు వచ్చినప్పటికీ, తాను మద్యం, జూదాన్ని ప్రచారం చేయనని పేర్కొన్నారు. ఈ అంశంలో కొందరు తనను సంప్రదించారని భారీ మొత్తంలో డబ్బు కూడా ఆఫర్ చేశారని చెప్పుకొచ్చారు. పలు మార్లు చాలామంది పదేపదే తనను సంప్రదించినప్పటికీ నిరంతరం నిరాకరిస్తున్నానని ఆయన వెల్లడించారు. తాజాగా ప్రముఖ కంపెనీకి చెందిన ఒక సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్‌ను ప్రచారం చేయడానికి




తనకు కోట్లు కూడా ఆఫర్ చేశారని, కానీ అది తన వ్యక్తిగత విలువలకు అనుగుణంగా లేకపోవడంతో దానిని తిరస్కరించానని ప్రకాష్ కుమార్ తెలిపారు. కీర్తితో పాటు తమకు సమాజం పట్ల బాధ్యత కూడా ఉండాలని అందుకే వాటికి దూరంగా ఉంటున్నాని అన్నారు. వినోద పరిశ్రమలో ఆర్థిక లాభం కంటే నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తున్నందుకు ఆయన వైఖరికి అభిమానులు ప్రశంసలు కురిపించారు. సంగీత దర్శకుడిగా పనిచేస్తూనే హీరోగా కూడా జి. వి. ప్రకాష్ రాణిస్తున్నారు. యుగానికి ఒక్కడు, మదరాసు పట్టణం, ఆకాశం నీ హద్దురా, అమరన్, లక్కీ భాస్కర్, పరాశక్తి, ఇడ్లీ కొట్టు వంటి చిత్రాలకు ఆయన సంగీతం అందించారు.

### నాగార్జున సినిమాలో ఛాన్స్ వస్తే
## ఎలాంటి సాంగ్ అయిన చేస్తా..

బిగ్ బాస్ ఫేమ్ దివి వద్య తన తాజా ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఆమె కెరీర్ ఆకాంక్షలు, ప్రముఖ తారలతో తన అనుభవాలు పంచుకుంది. ఇప్పటికే సూపర్ స్టార్ మహేష్ బాబు, మెగాస్టార్ చిరంజీవి వంటి దిగ్గజాలతో కలిసి పనిచేసిన దివి, తదుపరి కింగ్ నాగార్జునతో కలిసి ఒక స్పెషల్ సాంగ్ లేదా డ్యాన్స్ చేయాలని ఉందన్నారు. నాగార్జున అంటే తనకు ఎంతో గౌరవం, ప్రేమ అని, బిగ్ బాస్ షో తర్వాత ఆయన తన జీవితాన్ని మార్చివేశారని దివి వెల్లడించారు. ఆయనతో గడిపిన క్షణాలు తనకు చాలా ప్రత్యేకమన్నారు. ఆయన పట్ల తనకు అపారమైన అభిమానం ఉందని ఆమె పేర్కొన్నారు. మహర్షి షూటింగ్ సమయంలో మహేష్ బాబు సెట్‌లో అత్యంత అందమైన వ్యక్తి అని దివి ప్రశంసించారు. మహేష్ బాబు నుదుటిపై ఉన్న పుట్టుమచ్చను తాను ప్రస్తావించినప్పుడు ఆయన నవ్వడం, ఆ నవ్వు ఎంత క్యూట్‌గా ఉంటుందని.. జీవితంలో మరింత హ్యాండ్‌సమ్‌గా ఉంటారని అన్నారు. చిరంజీవి గురించి మాట్లాడుతూ, ఆయనకు సానుకూలమైన ఆరా ఉంటుందని దివి పేర్కొన్నారు. ఆయన తోటి నటులకు బలాన్ని ఇస్తారని, మాటలతోనే నవ్వించేస్తారని తెలిపారు. భయపడకుండా స్నేహితుడిలా నటించడానికి అవకాశం కల్పిస్తారని తెలిపారు. గాడ్ ఫాదర్‌లో ఆయనతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభూతి అని దివి చెప్పారు. బిగ్ బాస్ హౌస్‌ను వీడినప్పుడు చాలా సంతోషంగా ఉన్నానని దివి తెలిపారు. ఆ సమయంలో తాను మానసికంగా బలహీనపడ్డానని, భావోద్వేగాలకు గురవుతున్నానని అన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com